Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 14 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 7 ఫిబ్రవరి 2024 | బుధవారం | పేజీలు : 4

## బంగారం ధర మళ్లీ పెరిగింది

నిన్న స్థిరంగా ఉన్న బంగారం ధర నేడు మళ్లీ పెరిగింది. దేశంలో బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల బంగారం ధరపై రూ.440 వరకూ పెరిగింది. ఇక వెండి ధరలు మాత్రం స్వల్పం(400 వరకూ)గా తగ్గాయి. 22 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) 47,750 కాగా.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) 52,090గా ఉంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి.

**బంగారం ధరలు..** హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.47,750.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,090విజయవాడలో 22క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.47,750.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,090

# 'నన్ను.. నా పార్టీని టచ్ చేసి చూడు..'

## సీఎం రేవంత్‌కు కేసీఆర్ ఛాలెంజ్




హైదరాబాద్ : బీఆర్ఎస్‌కు పోరాటం కొత్త కాదని.. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే అంతిమంగా మనకు ముఖ్యమని బీఆర్ఎస్ నేతలతో ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. కేఆర్ఎంబీ అంశంపై మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ నేతలతో భేటీ జరిపారు. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డిపై హాట్ కామెంట్లే చేశారాయన. "నన్ను, నా పార్టీని టచ్ చేయడం నీ వల్ల కాదు. నీ కన్నా హేమాహేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకుంది" అంటూ ఆయన వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. "కృష్ణా బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులు వెళ్తే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. డ్యాంకు సున్నం వేయాలన్నా కూడా బోర్డు అనుమతి తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలివి లేదు. సీఎం .రేవంత్‌రెడ్డికి ప్రాజెక్టులపై అవగాహన లేదు. ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగిస్తే జరిగే నష్టం కూడా వారికి తెలియదు. కేంద్రం పెత్తనం వస్తే మనం అడుక్కు తినాల్సి వస్తుంది. అందుకే మన ప్రభుత్వం ఉండగా ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పుకోలేదు. ఇప్పుడు ఆ అవగాహన లేకే అప్పగింతకు ఒప్పుకున్నారు. .. బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులు తీసుకోవడం పైనే ఇక మన పోరాటం. నల్గొండలో భారీ బహిరంగ సభతో ఉద్యమం ఉధృతం చేద్దాం" అని పిలుపు ఇచ్చారు. 13వ తేదీన నల్గొండ లో కృష్ణా జలాల పరిరక్షణ సభ నిర్వహించాలని ఈ సందర్భంగా కేసీఆర్ బీఆర్ఎస్ నేతలకు సూచించారు. "నల్లగొండ సభకు నల్లగొండతో పాటు మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాల నుంచి ప్రజలు తరలించాలి. .. ఇప్పుడున్న పాలకులకు ప్రాజెక్ట్ లు, నీళ్ళ గురించి అవగాహన లేకపోవడంతో కేంద్రం గేమ్ స్టార్ట్ చేసింది. ప్రాజెక్టు కేంద్రం ఆధీనంలోకి వెళితే తెలంగాణ నష్టపోతుంది. ప్రజలకు ఈ విషయాన్ని వివరించి చెప్పాలి. కాంగ్రెస్ నేతలకు అవగాహన లేక ఏదేదో మాట్లాడుతున్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా నల్లగొండ లో సభ జరిగి తీరుతుంది అని కేసీఆర్ బీఆర్ఎస్ నేతలతో స్పష్టం చేశారు.

**సీఎం రేవంత్‌రెడ్డిపై హాట్ కామెంట్స్ :** ఇక ఈ భేటీలో కేఆర్ఎంబీ వివాదంతో పాటు కాంగ్రెస్ ఆరోపణలపైనా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ సీఎం కేసీఆర్ హాట్ కామెంట్లు చేశారు. "కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చిన 10 ఏళ్లలో ఏనాడూ తెలంగాణ ప్రాజెక్టులు అప్పగించలేదు. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రాజెక్ట్ లు మాకు అప్పగించాలని లేదంటే మేమే నోటిఫై చేస్తామని నన్ను బెదిరించారు. కావాలంటే తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెట్టుకో.. నా ప్రభుత్వాన్ని రద్దు చేస్తా.. తెలంగాణకు అన్యాయం చేస్తా అంటే అస్సలే ఊరుకోను. ప్రాజెక్టులు అప్పగించే ప్రసక్తే లేదని ఆనాడే చెప్పా. .. నన్ను వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీని కొత్త సీఎం ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు. నన్ను.. నా పార్టీని టచ్ చేయడం నీతో కాదు. నీ కంటే హేమా హేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకున్నది. రాష్ట్రాన్ని పదేళ్లు పదిలంగా కాపాడుకున్నాం. దాన్ని పరాయి వాళ్ల పాలు చేస్తున్నారు. తెలంగాణ కోసం కెసిఆర్ ఏనాడూ వెనక్కి పోడు.. ఉడుత బెదిరింపులకు భయపడను. ముందు ముందు ఏందో చూద్దాం...తెలంగాణ ప్రయోజనాల కోసం ఏం చేయాలో నాకు బాగా తెలుసు అని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.



## మరోసారి బండి సంజయ్ పాదయాత్ర.. ప్లాన్ ఇదేనా..?

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ పలు కసరత్తులు చేస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన బూస్టప్‌తో పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలిచే విధంగా ఆ పార్టీ అగ్ర నాయకత్వం ప్లాన్ చేస్తోంది. తెలంగాణలో ఎక్కువ ఎంపీ సీట్లు గెలిస్తేనే.. కేంద్రంలో కూడా చక్రం తిప్పవచ్చని కమలం పార్టీ భావిస్తోంది. దీనిలో భాగంగానే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పాదయాత్ర చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఈనెల 10వ తేదీ నుంచి బండి సంజయ్ పాదయాత్ర చేయనున్నారు. ఈ యాత్రకు "విజయ సంకల్ప యాత్ర"గా నామకరణం చేశారు. పార్లమెంట్ ఎన్నికలు జరిగే వరకు ఈ పాదయాత్రను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. కొండగట్టు వద్ద పూజ చేసి మేడిపల్లి నుంచి ఈ పాదయాత్రను ప్రారంభించనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాల్లో ఈ యాత్ర కొనసాగనున్నది. గ్రామాల మీదుగా ఈ యాత్ర సాగనున్నది. యాత్ర పేరుతో వీలైనంత మేరకు ఎక్కువ గ్రామాల్లోకి వెళ్లేందుకు సంజయ్ ప్లాన్ చేసుకుంటున్నారు. రూట్ మ్యాప్ ఖరారు చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యారు.

# ఆశావహుల్లో... ఆందోళన...!


## 'నామినేటెడ్'కు పోటా పోటీ!

హైదరాబాద్ : అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తొందరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని డిసైడ్ అయ్యింది. పార్టీ గెలుపుకు బాగా కష్టపడిన నేతల పేర్లను జిల్లాల వారీగా రెడీ చేయమని రేవంత్ రెడ్డి నుండి పార్టీలోని ముఖ్య నేతలకు ఆదేశాలు అందినట్లు పార్టీలో టాక్ వినబడుతోంది. కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్ పోస్టులతో పాటు జిల్లాల స్థాయిలో భర్తీకి అవకాశమున్న కార్పొరేషన్లు, వాటిలో డైరెక్టర్ పోస్టులు చాలా ఉన్నాయి. ప్రయారిటి బేసిస్ ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలన్నది రేవంత్ ఆలోచనగా తెలుస్తోంది. ముందు రాష్ట్రస్థాయి కార్పొరేషన్లను భర్తీచేసి తర్వాత జిల్లాల స్థాయిలో నియామకాలను పూర్తి చేయాలని అనుకుంటున్నారట. ఈ భర్తీ ప్రక్రియలో కూడా కాంగ్రెస్ కు అత్యధిక సీట్లను అందించిన జిల్లాల వారీగా చేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీని ప్రకారం చూస్తే ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని నేతలకే మెజారిటి పదవులు అందే అవకాశాలున్నాయి. ఎందుకంటే కాంగ్రెస్ కు వచ్చిన 64 సీట్లలో పై మూడు జిల్లాలదే మేజర్ పాత్ర కాబట్టి. పై మూడు జిల్లాల్లో బీఆర్ఎస్ దాదాపు తుడిచిపెట్టుకుపోయిందనే చెప్పాలి. ఈ మూడు జిల్లాల నుండి గట్టి దెబ్బ పడటం వల్లే బీఆర్ఎస్ ఓడిపోయి ప్రతిపక్షంలో కూర్చోవాల్సొచ్చింది. అందుకనే మరే జిల్లాకు దక్కనట్లుగా ఖమ్మం జిల్లాకు మూడు మంత్రిపదవులు దక్కాయి. జిల్లాలో పదిసీట్లుంటే కాంగ్రెస్ తొమ్మిది నియోజకవర్గాల్లో గెలిచింది. పదో నియోజకవర్గంలో బీఆర్ఎస్ బొటాబొటిగా గెలిచింది. లేకపోతే పదికి పదీ కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసుండేదే తొందరలోనే జరగబోతున్న పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ స్వీప్ చేయాలని రేవంత్ పట్టుదలగా ఉన్నారు. అది జరగాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడినట్లే నేతలంతా ఏకతాటిపైకి వచ్చి బీఆర్ఎస్, బీజేపీలపై పోరాటం చేయాల్సుంటుంది. ఎలాగూ అధికారంలోనే ఉన్నారు కాబట్టి, నెలరోజుల పాలనలో ప్రజలు కూడా సానుకూలంగా ఉన్నారు కాబట్టి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు అందుకుంటుందనే అనుకుంటున్నారు. అందుకనే పార్లమెంటు ఎన్నికలు అయిపోగానే నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ శ్రీకారం చుట్టబోతున్నారు. అందుకనే ఇపుడు జాబితాలు రెడీ చేయిస్తున్నారు.



# గెలుపు గుర్రాలకై వేట

## పార్లమెంటు స్థానాలకు బలమైన అభ్యర్థుల కోసం అన్ని పార్టీల సోదన




## విజయలక్ష్మి వరించే వారికే టిక్కెట్లు

హైదరాబాద్: రాజధానిలో మళ్లీ రాజకీయ వేడి మొదలైంది. వీలైనన్ని లోక్‌సభ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవడానికి ప్రధాన పార్టీలు అప్పుడే దృష్టి సారించాయి. బలమైన అభ్యర్థులను బరిలో దింపడం ద్వారా అన్ని స్థానాలను కైవశం చేసుకుని తమ సత్తా చాటాలని అధికార కాంగ్రెస్ యోచిస్తోంది. ఇందులో భాగంగా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. భారాస ఒక్క స్థానంలో సిట్టింగ్ ఎంపీనే బరిలో దింపాలని నిర్ణయించింది. మిగిలిన స్థానాల్లో 'బలమైన' అభ్యర్థులను బరిలో దింపడానికి నేతలతో చర్చలు మొదలుపెట్టింది. ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్షలు మొదలుపెట్టింది. గతంలో కాకుండా ఈసారి ఈ రెండు ప్రధాన పార్టీలకు దీటుగా బలమైన అభ్యర్థులను దింపడం ద్వారా ఆ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలని భాజపా ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జిలను ప్రకటించింది. రాజధాని పరిధిలో హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ స్థానాలొస్తాయి. మార్చిలో ఎన్నికల షెడ్యూల్, ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో 64 స్థానాలను సాధించిన కాంగ్రెస్.. రాజధానిలో మాత్రం అనుకున్న విధంగా సాధించలేకపోయింది. మొత్తం 29 స్థానాల్లో 3 మాత్రమే దక్కించుకుంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపడానికి ఇప్పటి నుంచే అన్వేషణ మొదలుపెట్టింది.

**హైదరాబాద్ :** ఇక్కడి నుంచి పోటీకి ఏ నేతలూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి ఫిరోజ్‌ఖాన్‌కుగానీ, మరొకరికిగానీ టిక్కెట్ దక్కే అవకాశం ఉందంటున్నారు. ఎంఐఎం తరపున మరోసారి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేస్తున్నారు. చేవెళ్ల ఇక్కడి నుంచి అనేక మంది నేతలు కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తున్నా రెండు ప్రధాన పార్టీల్లో బలమైన నేతల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భాజపా విషయానికి వస్తే మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డికి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. భారాస ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని మరోసారి పోటీకి నిలుపుతున్నామని ప్రకటించింది. సికింద్రాబాద్ అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్ తదితర నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో భారాస నుంచి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయికిరణ్ యాదవ్ పోటీ చేశారు. ఈసారి అతనికే ఇస్తారా లేనిపక్షంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌నే బరిలో నిలుపుతారా అన్నది కొద్ది రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇక భాజపా నుంచి మరోసారి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోటీకి నిలిపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక్కడి నుంచి అభ్యర్థిని బరిలో దింపాలా లేదా అన్నదానిపై ఎంఐఎం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

**మల్కాజిగిరి :** గత ఎన్నికల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గెలుపొందగా ఈస్థానాన్ని మళ్లీ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఆయన ఉన్నారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి పోటీకి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మల్‌రెడ్డి రాంరెడ్డి, మధుయాస్కీ ఆసక్తి చూపిస్తున్నారు. ఇక భారాస తరఫున ఈ స్థానం నుంచి మాజీ మంత్రి కేటీఆర్ బరిలో దిగాలని ఆ పార్టీ నేతలు గట్టిగా కోరుతున్నారు. అయితే ఈ టిక్కెట్‌ను తనకు ఇవ్వాలని మాజీ మంత్రి మల్లారెడ్డి కోరుతున్నారు. ఇది కొద్దిరోజుల్లోనే తేలనుంది. నేతల ఒత్తిడి తలొగ్గి కేటీఆర్‌ను అభ్యర్థిగా భారాస అధిష్ఠానం నిర్ణయిస్తే కాంగ్రెస్ కూడా ఆర్థికంగా బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని యోచిస్తోంది.

# సంపాదకీయం

## రాజకీయ ఎత్తు 'గడల'

ఆయన రాష్ట్ర స్థాయి అధికారి.. కానీ గత ప్రభుత్వంలో అధికార పార్టీకి బాహాటంగానే మద్దతు పలికారు. మహమ్మారి సమయంలో ఎంతో పేరు తెచ్చుకున్న ఆయన ఆ తర్వాత వ్యవహార శైలితో వివాదాస్పదం అయ్యారు. ప్రభుత్వ అధికారి అయి ఉండి కూడా పాలకులకు అత్యంత విధేయంగా ఉండడంపై విమర్శలు వచ్చాయి. ఇక తన అంతిమ లక్ష్యం ఎన్నికల్లో పోటీకి టికెట్ తెచ్చుకోవడమేనని ప్రకటించారు. అయితే, అది వేరేవారికి దక్కింది. మరోవైపు ఇప్పుడు ప్రభుత్వం మారింది. ఆయన పదవీ మారింది. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థతుల్లో తెలివైన ఎత్తుగడ వేశారు. ఏ సర్కారుకు ఆ సర్కారు వారి పాట తెలంగాణలో ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడంతో కొందరు అధికారుల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లైంది. మరీ ముఖ్యంగా కొందరు రాష్ట్ర స్థాయి అధికారులు బీఆర్ఎస్ సర్కారుకు అత్యంత విధేయంగా వ్యవహరించారు. ఇలాంటివారంతా ఇప్పుడు ఏం చేయాలా? అని ఆలోచిస్తున్నారు. ఇక కొందరు అధికారులు పీకల్లోతు ఆరోపణల్లో కూరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గనుక గుడ్లురిమితే వీరంతా కటకటాలపాలవ్వాల్సిందే. అందుకని కొత్త సారును ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇంతలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇదే అవకాశంగా భావించిన ఓ రాష్ట్ర స్థాయి అధికారి ఏకంగా రెండు లోక్ సభ టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు అసెంబ్లీ.. ఇప్పుడు లోక్ సభ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓ సీటు కోసం విశ్వప్రయత్నాలు చేసిన ఆయన.. ఇప్పుడు ఏకంగా లోక్ సభ సీటుకే గురిపెట్టారు. అయితే, ప్రభుత్వం మారాక ఆయనను వేరే పోస్టుకు బదిలీ చేశారు. అంతేగాక, అవినీతి ఆరోపణలపై విచారణకు ఫైలు కదులుతోంది. దీంతో ఆ అధికారి అధికార పార్టీని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అందుకే నేను మీ వాడిని అనే సంకేతాలు ఇచ్చేలా లోక్ సభ టికెట్ కు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తానికి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అనుకూలంగా ఎత్తుగడ వేశారు. కొసమెరుపు: అసెంబ్లీ ఎన్నికల టికెట్ కోసం ఓ నియోజకవర్గంలో ఈ అధికారి ఏకంగా రూ.2 కోట్ల దాకా ఖర్చుపెట్టారు. కానీ, సిటింగ్ కే సీటిచ్చిన బీఆర్ఎస్.. ఈయనకు మొండిచేయి చూపింది. ఆ అసహనంతో కొన్నాళ్లు బయట కు రాలేదు. మళ్లీ ఇప్పుడు ఏకంగా పార్టీ మార్చి కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు పెట్టారు.

# ప్రత్యేకాధికారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయతీల పాలన నిర్వహించాలి...

**గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు వారి విధులను,బాధ్యతలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులు నిర్వర్తించాలని... మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్.**








జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులకు నియమితులైన వారందరూ తమ తమ విధులను తెలుసుకొని సక్రమంగా నిర్వర్తించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. మంగళ వారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారుల శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... సర్పంచుల పదవీకాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 61 గ్రామ పంచాయతీలకు, జిల్లా అధికారులను,మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని, వీరు బాధ్యతలు కూడా స్వీకరించారని తెలిపారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు అందరు నూతన పంచాయితీరాజ్ యాక్ట్ 2018 పై స్పష్టమైన అవగాహన పొందాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలను సక్రమంగా నిర్వహించే గురుతర బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉంచిందని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గ్రామపంచాయతీ నిర్వహణను ప్రతిష్టాత్మకం గా తీసుకోవాలని ,గ్రామ పంచాయతీల సక్రమ నిర్వహణకు సీనియర్ అధికారులను సైతం గ్రామపంచాయతీ అధికారులుగా నియమించడం జరిగిందని, ప్రత్యేక అధికారులు సర్పంచుల కన్నా ఇంకా జాగ్రత్తగా గ్రామపంచాయతీల విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రత్యేక అధికారులుగా నియామకం అయినందున పంచాయితీ శాఖ అధికారాలు, విధులు తెలుసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా వివిధ దశలలో వున్న అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మౌళిక సదుపాయాల కల్పనతో పాటు గ్రామాలలోని యువతను అభివృద్ధి పనులలో భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. పంచాయితీ రాజ్ చట్టంలో సూచించిన విధంగా క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనులు నిర్వహించాలని, గ్రామ పంచాయితీ సెక్రటరీ, సిబ్బంది సమన్వయంతో ప్రజల అవసరాలను తీర్చాలని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రతి రెండు నెలలకు జరిగే గ్రామ సభలకు ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహించి ఆదాయ వ్యయాలపై సమీక్షించాలని, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపొందించి గ్రామ సర్పంచ్ పోర్టల్ లో నమోదు చేయాలని, 100 శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మేడ్చల్ జిల్లా హైదరాబాద్ కి దగర గా వుంది అభిరుద్ధి చాల వేగవంతము గా ఉంటుంది కావునా గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించినారు మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీలలో భూములను కాపాడటం లో ప్రత్యేక దృష్టి సారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయితీల ఆస్తులను పరిరక్షించాలని, లే అవుట్లను పరిశీలించాలని, తప్పనిసరిగా లే అవుట్లో పది శాతం గ్రామ పంచాయితీకి చెందేలా చూడాలని అన్నారు. నిబంధనల ప్రకారమే బిల్డింగ్%% అనుమతుల ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఉపాధి హామీలో గ్రామాల అవసరాలకు అనుగుణంగా ఎక్కువ పనులు చేపట్టేలా, ఎక్కువ మందికి పనులు కల్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ సంబంధించిన 7 రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించబడేలా చూడాలని, అలాగే గ్రామ పంచాయితీలలో జరిగిన పనులకు సంబంధించి రికార్డులు ఆడిట్ చేయించాలని, ప్రతి నెలా సిబ్బంది జీతాలు, సిసి బిల్లులు, ట్రాక్టర్, ట్రాలీ పేమెంట్స్ చెల్లించేలా చూడాలని తెలిపారు. గ్రామ పంచాయితీల ఆదాయ మార్గాలను పరిరక్షించాలని, రిజిష్టర్స్ నిర్వహించాలని, వచ్చే నిధులలో పారిశుధ్యం, తాగునీటిపై నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని తెలిపారు. గ్రామ పంచాయితీల నిర్వహణలో భాగంగా నీటి సరఫరా, పారిశుధ్యం, గ్రీవెన్స్, టాక్స్ కలెక్షన్స్, బడ్జెట్ తదితర రిజిష్టర్లను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, పంచాయతీరాజ్ చట్టం, స్టాండింగ్ కమిటీలు, ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు, విధులు, లేఅవుట్ల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ ,తదితర అంశాలపై కూలంకషంగా వివరించారు.. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులకు పంచాయితీ రాజ్ చట్టం 2018, విధులు, బాధత్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ నిర్వహించబడింది.
ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, డీపీవో రమణమూర్తి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి పద్మజారాణి, గ్రామ పంచాయితీల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాతకు మూత..!



మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని ప్రభుత్వం చెబుతున్నా.. నివేదికలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. కేరళ రాష్ట్రంలో 83 శాతం ప్రభుత్వ, 13 శాతం ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. మన రాష్ట్రంలో ప్రస్తుతం 47 శాతం ప్రభుత్వ, 53 శాతం విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని అధికారుల నివేదికలు చెబుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2001లో 84 శాతం ప్రభుత్వ, 16 శాతం ప్రైవేటు పాఠశాలల్లో చదివినట్లు నివేదికలే చెబుతున్నాయి. తక్కువగా చేరికలు ఉన్న పాఠశాలలను మూసివేసి సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేయడంతో పాటు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 శాతం పాఠశాలలు మూతపడనున్నాయి. మండల విద్యాధికారులు విద్యార్థుల సంఖ్య, హాజరుశాతం వివరాలు సేకరిస్తున్నారు.

ప్రామాణికంగా తీసుకోవాల్సిన అంశాలు..

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7 తరగతుల్లో పది మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉంటే మూసివేయాలని నిర్ణయించారు. ఉన్నత పాఠశాలల్లో 30 లోపు చేరికలు ఉన్నట్లయితే వాటిని మూసివేసి సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి.

విస్తృతంగా పాఠశాలల ఏర్పాటు..

దేశంలో విద్యా ప్రమాణాల పెంపునకు 1986లో కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ బ్లాక్‌బోర్డు పథకం' ప్రారంభించింది. దీని నిధులతో గ్రామాలు, తండాలు, ఆవాసాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసి అక్షరాస్యత పెంపునకు కృషి చేసింది. 2010 విద్యాహక్కు చట్టంతో గ్రామానికి, తండాకు ఒక కిలోమీటరు దూరంలో ప్రాథమిక పాఠశాల, 3 కి.మీ. దూరంలో ప్రాథమికోన్నత పాఠశాల, గ్రామానికి 5 కి.మీ. దూరంలో ఉన్నత పాఠశాల ఉండాలని చట్టం చెబుతోంది. అలాంటి పరిస్థితి లేక దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటే రవాణా భత్యం రూ.600 నెలకు ఇవ్వాలని నిర్ణయించారు.

కారణాలివే.. విద్యార్థుల కోసం కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, ఆదర్శ, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఏర్పాటు చేశారు. వీటిలో చేరేందుకు 6, 7 తరగతుల వారంతా ఆసక్తి చూపుతుండటంతో ఉన్నత పాఠశాలల్లో చేరికలు తగ్గిపోతున్నాయి. ప్రాథమిక స్థాయిలో ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకు తల్లిదండ్రులు తమ పిల్లల్ని అధికంగా ప్రైవేటు పాఠశాలల్లోనే చేర్పిస్తున్నారు.

కేరళ రాష్ట్రంలో ప్రధానంగా 40 వేల జనాభా ఉంటే ఒక్క ప్రైవేటు పాఠశాలకు మాత్రమే అనుమతిస్తారు. సొంత భవనం అన్ని సౌకర్యాలను మూడు దశల్లో తనిఖీలు చేసి అనుమతిస్తారు.

మన రాష్ట్రంలో ఎలాంటి అనుమతి సౌకర్యాలు లేకున్నా ప్రైవేటు పాఠశాలలు పదుల సంఖ్యలో ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.

నివేదిక సిద్ధం చేస్తున్నాం..

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాల ఆధారంగా నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సూచనలకు అనుగుణంగా పిల్లలు లేనిచోట పాఠశాలలు మూసివేస్తున్నాం. విద్యార్థులను సమీప పాఠశాలల్లో చేర్పించటం, ఉపాధ్యాయులను అవసరమైన చోట సర్దుబాటు చేస్తాం. బాలాజీనాయక్,మండల విద్యాధికారి, మిర్యాలగూడ

# అర్హులకు దక్కని పోడు!

మిర్యాలగూడ : ఏళ్ల తరబడి అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వం ఇటీవలే హక్కు పత్రాలు పంపిణీ చేసింది. అయితే పోడు పట్టాల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినా కేవలం వందల సంఖ్యలోనే పట్టాలు అందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,042 ఎకరాలకు 2,256 మంది గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. కాగా పోడు పట్టాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపికలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అనేక గ్రామాల్లో ఏళ్ల తరబడి సాగులో ఉన్న వారికి కాకుండా..అసలు సాగులో లేని వారికి పట్టాలు పంపిణీ చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

కార్యాలయాలకు పరుగులు

పలు గ్రామాల్లో అటవీ అధికారుల సర్వేతో పాటు గ్రామ కమిటీలు సిఫార్సు చేసిన వారికి సైతం పట్టాలు రాకపోవడంతో వారంతా తహసీల్, ఆర్డీవో కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. దామరచర్ల, తిరుమలగిరి సాగర్, అడవిదేవులపల్లి మండలాల నుంచి పలువురు రైతులు సోమవారం మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయానికి వచ్చి వినతి పత్రాలు సమర్పించారు. 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు వచ్చి.. రైతుబంధు అమలవుతుందని ఆశపడితే అడియాసే మిగిలిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అర్హులైన వారికి పోడు పట్టాలు అందించాలని



బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఒత్తిడితో అనారోగ్యం పాలయ్యాను:

మేము తాతల కాలం నుంచి 20 ఏళ్ల పైనుంచి 2.20 ఎకరాల్లో సాగులో ఉన్నాం. గ్రామ కమిటీ సిఫార్సుతో పాటు అర్హుల జాబితాలో మా పేరు వచ్చింది. బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డులు సైతం సేకరించారు. ఏమైందో తెలియదు కానీ.. చివరి నిమిషంలో మాకు పట్టా రాలేదు. దీంతో ఒత్తిడి భరించలేక రక్తపోటు పెరిగి..మూతి వంకరపోయింది. చికిత్సకు రూ.20వేల పైనే ఖర్చయింది. ఆ పొలమే మాకు జీవనాధారం..అధికారులు స్పందించి నాకు పట్టా అందించాలని కోరుతున్నా.బండావత్ నాగు, బండావత్ తండా, దామరచర్ల మండలం

2005 నుంచి సాగులో ఉన్నాం:

మా అమ్మనాన్నలు సేలి-దస్రుతో కలిపి మేము 2005 నుంచి మూడెకరాలు సాగు చేసుకుంటున్నాం. అటవీ అధికారులు, గ్రామ కమిటీ సర్వే చేసి..తాము అర్హులుగా నివేదిక ఇచ్చారు. ఆ నివేదికను తీసుకోవడంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తాత్సారం చేస్తున్నారు. దీంతో మాకు పట్టా మంజూరులో ఆలస్యమవుతోంది. తక్షణమే అధికారులు స్పందించి మాకు పట్టా మంజూరు చేయాలి.సపావట్ దాసు, జువ్విచెట్టు తండా, తిరుమలగిరి సాగర్ మండలం

# నాలుగేళ్లుగా.. ఎదురుచూపులేగా..!

సూర్యాపేట : గత పదేళ్లుగా ఆయకట్టుతో పాటు ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల బావులు, బోర్లతో వ్యవసాయానికి సాగునీరు అందిస్తున్నారు. 2001-02లో వచ్చిన కరవు తర్వాత ఆయకట్టులో 70 శాతం మంది రైతులు బోర్లు, బావులు తవ్వించారు. వీటికి మోటార్లు ఏర్పాటు చేసుకుని కొద్ది కమతంలో పంటలు పండిస్తున్నారు. ఒక వ్యవసాయ విద్యుత్తు సర్వీసు మంజూరు కావాలంటే ముగ్గురు లేదంటే నలుగురు రైతులు డీడీలు చెల్లించాలి. ఒక్కో డీడీ ప్రస్తుతం రూ.5800లు (గతంలో రూ.4960 ఉండేది) చెల్లించాలి. ఒక్క డీడీ చెల్లిస్తే ప్రభుత్వం ఒక్క డీడీకి రూ.70 వేల రాయితీ ఇస్తుంది. ఇలా మూడు డీడీలకు రూ.2,10,000 ప్రభుత్వం నుంచి రాయితీ రూపంలో విద్యుత్తు శాఖకు అందుతుంది. ఆ డబ్బుతో రైతులకు ఒక విద్యుత్తు నియంత్రిక, ఒక డీపీ స్తంభం, ఏబీ స్విచ్, ఎస్‌జీ ఫ్యూజు, దిమ్మె, కూలీల ఖర్చు, ఎర్త్ తదితర సామగ్రి సమకూర్చుతారు. నాలుగు డీడీలు చెల్లిస్తే నియంత్రికతో పాటు అదనంగా 5 స్తంభాల మేర లైను వస్తుంది. రైతులు ఎక్కువగా నాలుగు డీడీలు చెల్లిస్తుంటారు. ఏటేటా రైతుల అవసరాలు పెరుగుతుండటంతో తదనుగుణంగా సర్వీసులు మంజూరు ఇవ్వడం లేదు. కొంతమంది రైతులు నాలుగేళ్ల క్రితం డీడీలు చెల్లించి నేటికి సర్వీసు మంజూరు, లైన్ ఏర్పాటుకు ఎదురుచూస్తున్నారు.

సకాలంలో మంజూరు ఇస్తే..రైతులు డీడీలు చెల్లించిన వెంటనే మంజూరు ఇచ్చి నియంత్రిక ఏర్పాటు, లైన్లు వేయడం పూర్తి చేస్తే పెరిగిన భారం పడేది కాదు. ప్రభుత్వం జాప్యం చేయడంతో అది నాలుగేళ్ల తర్వాత రైతులపై పడుతుంది. సకాలంలో డీడీలు చెల్లించినా భారం పడటం అన్యాయ మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓఆర్‌స్మీ చెల్లించినా కొంతమ ందికి మంజూరు రావడం లేదు. గరిడేపల్లిలో కొంతమంది రైతులు రూ.2.62 లక్షలు ఓఆర్‌స్మీ చెల్లించారు. అయినా పనులు చేయడానికి రెండు నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తుంది. ఇలా ఉమ్మడి జిల్లాలో పది వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

ఓఆర్‌స్మీ చెల్లించి రెండు నెలలుమేము కొంతమంది రైతులం కలిసి 2019 సెప్టెంబరు 24న ముగ్గురం ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు, నలుగురం మరో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏడు డీడీలు తీశాం. 2023 ఏప్రిల్‌లో రూ.2.62 లక్షలు ఓఆర్‌స్మీ కట్టాలని అధికారులు చెప్పారు. యాసంగి పంట చేతికి రావడంతో అప్పులు పోగా మిగిలిన సొమ్మును వానాకాలం పెట్టుబడికి ఉంచుకుందామ నుకున్నా.. అందరు కరెంటు కోసం డబ్బులు కట్టాలంటే ఓఆర్‌స్మీ కింద ఏప్రిల్ 17న చెల్లించాం. నియంత్రిక, స్తంభాలు వేయండని అధికారులను అడిగితే టెండర్ పిలవాలని చెబుతున్నారు. స్మీజన్ వచ్చింది. నారుమడికైనా నీరు పెట్టుకుందామంటే మోటారుకు విద్యుత్తు లేదు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే లైను, నియంత్రిక ఏర్పాటు చేయండి.

బండ వెంకటరెడ్డి. గరిడేపల్లివారంలో టెండర్ పూర్తి చేస్తాం

ఓఆర్‌సీ ఎక్కువ ఉంటే టెండర్ పిలవాల్సి ఉంటుంది. టెండర్‌కు నోటీసు బోర్డుపై పెడుతున్నాం. వారంలో పూర్తి చేస్తాం. వెంటనే లైన్ వేయిస్తాం .వెంకటకృష్ణయ్య, డీఈ హుజూర్‌నగర్.

రైతులపై పెరిగిన భారంరైతులు చెల్లించిన డీడీలకు ప్రభుత్వం ఎప్పటి నుంచో రూ.70 వేల రాయితీ ఇస్తుంది. 2016-17 సంవత్సరం నుంచి నియంత్రికలు, కరెంటు సామగ్రి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. 2018-19లో రూ.75 వేలు ఉన్న 25 కేవీ విద్యుత్తు నియంత్రిక ప్రస్తుతం రూ.1.20 లక్షలు అయింది. ప్రభుత్వం రాయితీ పెంచలేదు. కేవలం రూ.70 వేలు ఇస్తుంది.

# మహాజాతరకు దారి కష్టాలు!

పెద్దపల్లి: ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన పండుగ సమ్మక్క-సారలమ్మ జాతర. వన దేవతలను దర్శించుకునేందుకు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తజనం పెద్దఎత్తున తరలి వెళ్తారు. మరో 18 రోజుల్లో మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు జిల్లాల వారు ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. దీంతో రహదారులపై వాహనాల రద్దీ రెట్టింపు కానుంది. అయితే ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రహదారులు గుంతలు తేలి, విస్తరణ పనులతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్నాయి. వరంగల్- కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారితోపాటు జయశంకర భూపాలపల్లి జిల్లాకు వెళ్లే పెద్దపల్లి - మంథని మార్గం, గోదావరిఖని- మంథని మార్గంలో గుంతల దారులు, మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మేడారం జాతర సందర్భంగా ప్రధాన రహదారులకు మరమ్మతు చేయ కుంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు అసౌకర్యంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులూ తలెత్తే అవకాశం ఉంది.

రహదారి : గోదావరిఖని - అడవిసోమన్‌పల్లి రహదారి
ఎక్కడి నుంచి ఎక్కడికి : గోదావరిఖని - మంథని - అడవిసోమన్‌పల్లి
ఎన్ని కిలోమీటర్లు : 55 కి.మీ.లు
మేడారానికి ఏయే ప్రాంతాల వారు ప్రయాణించే అవకాశం : ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లావాసులు రహదారి పరిస్థితి : మంథని మండలం నాగారం నుంచి మంథని పట్టణం వరకు 4 కి.మీ.ల దూరం రహదారి అధ్వానంగా ఉంది. గుంతలతో ఇబ్బంది ఎదురవుతుంది. అటవీ ప్రాంతంలోని రహదారి మూలమలుపులతో ప్రమాదం వాటిల్లుతుంది. భట్టుపల్లి సమీపంలోని ఘాట్ రోడ్డు



ప్రమాదకరంగా ఉంది. భట్టుపల్లి నుంచి అడవి సోమన్‌పల్లి వరకు 12.కి.మీ.లదూరం గుంతల దారితో ఇబ్బందిగా ఉంది. మంథని మూలమలుపు, ఘాటు రోడ్డు కావడంతో వేగంగా వచ్చిన వాహనాలు బోల్తాపడుతున్నాయి. కరీంనగర్-జగిత్యాల-సిరిసిల్ల రహదారులపై గుంతలపై ప్యాచ్‌వర్క్‌లు చేయక ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

పెద్దపల్లి- మంథని రహదారి
పెద్దపల్లి పై వంతెన నుంచి మంథని వరకు
33 కి.మీ.లు
జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల వారు
రహదారి పరిస్థితి : పెద్దపల్లి- మంథని దారి ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా లారీల రాకపోకల మూలంగా తరచూ రహదారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలుచోట్ల గుంతలతో ఇబ్బందులు ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు లేవు.

ఎన్‌హెచ్- 563
బండలింగాపూర్ నుంచి హుజూరాబాద్ వరకు
130 కి.మీ
నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల ప్రజలు.రహదారి పరిస్థితి : కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అక్కడక్కడా మట్టి, తారు పనులు జరుగుతుండటంతో దుమ్ము, ధూళి వాహనదారులపై పడుతోంది. ఈ పనుల వల్ల కొన్ని ప్రాంతాల్లో వాహనాలు ఒకే మార్గంలో వెళ్లాల్సి వస్తోంది. దీంతో జాతర సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

## భూసర్వేకు తొలగనున్న అడ్డంకులు

కోరుట్ల: గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టి కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. భూదస్త్రాల విభజన జరగక భూముల హద్దులు తేల్చేందుకు చేపట్టాల్సిన సర్వేకు అడ్డంకులు ఏర్పడ్డాయి. సాంకేతిక సమస్యలతో దస్త్రాల విభజనలో జాప్యం కలిగింది. ఎట్టకేలకు ఉమ్మడి జిల్లా నుంచి ఇటీవల జిల్లా భూముల దస్త్రాలు(సెత్వారి, టిప్పన్‌లతో పాటు భూకమతాల చిత్రాలు నక్షాలు) భూకొలతల కార్యాలయానికి చేరాయి. దీంతో భూముల సర్వేకు చెందిన క్షేత్రస్థాయి అడ్డంకులు తొలగనున్నాయి.

పక్కాగా హద్దులు..జిల్లాకు చెందిన భూముల దస్త్రాలు(సెత్వారి, టిప్పనల్, భూకమతాల చిత్రాల నక్షాలు) కార్యాలయానికి చేరగా వాటిని సర్వేయర్లతో కార్యాలయంలో కంప్యూటరీకరణ చేస్తున్నారు. సాంకేతికతో(అడ్వాన్సు సర్వే సిస్టమ్) సాఫ్ట్‌వేర్‌కు గ్రామాలకు సంబంధిం



చిన రికార్డులను సర్వేయర్లు అనుసంధానం చేస్తున్నారు. నూతనంగా వచ్చిన క్యూజీఐఎస్(క్వాంటమ్ జీయోగ్రఫీ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్)తో రికార్డులను డిజిటలైజేషన్ చేయనుండటంతో గ్రామాల మధ్య ఉన్న సరిహద్దుల గ్యాప్ విభేదాలు, సర్వే నంబర్ల మధ్య హద్దులు పక్కాగా తెలనున్నాయి. కంప్యూటర్ రికార్డులతో కొలతలు కచ్చితంగా ఉండటంతో పాటు త్వరితగతిన సర్వే నివేదిక ఇవ్వడం జరుగుతుంది. సర్వేయర్ల ఖాళీలు జిల్లాలో 20 మంది సర్వేయర్లకు గానూ 9 మంది ఉండగా, ఇద్దరు డీఐలకు ఒక్కరే ఉన్నారు. కార్యాలయాల్లో ఆధునిక పరికరాలు లేకపోవడంతో సర్వే కోసం ప్రైవేటు వారిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. డీజీపీఎస్‌తో పాటు ఆధునిక సాంకేతిక పరికరాలు కంప్యూటర్లను ఏర్పాటు చేయడంతో పాటు సర్వేయర్ల ఖాళీలను తీర్చాల్సిన అవసరముంది.

పరిపాలన విభాగానికి రికార్డులు
వెంకట్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి
ప్రస్తుతం జిల్లా కార్యాలయంలో పాత రికార్డుల కంప్యూటరీకరణ జరుగుతుంది. క్యూజీఐఎస్ సాంకేతికపై ఇద్దరు సర్వేయర్లను శిక్షణకు పంపించాం. జిల్లా పరిపాలన విభాగానికి కంప్యూటర్ సర్వే రికార్డులను త్వరితగతిన పూర్తిచేసి అప్పగిస్తాం. డిజిటలైషన్ పూర్తితో భూముల సర్వే కోసం నిరీక్షిస్తున్న వారి సమస్యలు తొలగనున్నాయి.

# సైబర్ నేరం.. మనోళ్లు సాయం!



మొయినాబాద్ : సైబర్ నేరాల జాబితాలో కొత్త రాష్ట్రాలు చేరుతున్నాయి. ప్రధానంగా ఉత్తరాదిలోని కొన్ని రాష్ట్రాలకు చెందిన మోసగాళ్లే మొన్నటివరకు సైబర్ నేరాలు చేస్తుండేవారు. ఇప్పటివరకూ అరెస్టయిన నిందితులంతా వారే. తాజాగా హైదరాబాద్‌లోనూ సైబర్ నేరాలు చేస్తూ పట్టుబడడం ఆందోళన కలిగిస్తోంది. పొరుగు రాష్ట్రాల్లో ఉండే నేరగాళ్లతో ఆన్‌లైన్‌లో మిలాఖత్ అవుతూ వందలాది మందిని ముంచేస్తున్నారు. ఇంకొందరు చైనాలోని సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. సాధారణంగా కాల్‌సెంటర్ మోసాల్లో టెలీకాలర్లుగా మాట్లాడేందుకు తెలుగు రాష్ట్రాల్లోని యువకుల్ని సైబర్ ముఠాలు ఉపయోగించేవి. గత కొన్ని నెలలుగా నమోదవుతున్న కేసుల్లో మాత్రం ఏపీ, తెలంగాణలోని వ్యక్తులే సొంతంగా నేరాలు చేస్తూ పట్టుబడుతున్నారు. లేదా పరోక్షంగా సహకరిస్తున్నారు.

కమీషన్లకు ఆశపడి..!ఎక్కడో ఇతర రాష్ట్రాల్లో ఉంటూ ఇతరుల బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు ఉపయోగిస్తూ సైబర్ నేరగాళ్లు డబ్బు కొల్లగొడుతుంటారు. వివరాలన్నీ నకిలీవి కావడం, సాంకేతికత సాయంతో ఒక రాష్ట్రంలో ఉంటూ.. మరో రాష్ట్రంలో నేరం చేసినట్లు బురిడీ కొట్టించేవారు. ఆ డబ్బులను క్రిప్టో కరెన్సీ లేదా ఇతర బ్యాంకు ఖాతాలకు మళ్లించి డబ్బు విత్‌డ్రా చేసుకుంటారు. ఇందులో భాగంగానే నేరగాళ్లు తెలుగు రాష్ట్రాలవారిని సంప్రదిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నేరగాళ్లు తమ మోసాల కోసం టెలిగ్రామ్, వాట్సాప్‌లో గ్రూపులు తయారుచేసి తాము మోసం చేయాలనుకున్న వ్యక్తుల ఫోన్ నంబర్లను వాటిలో చేరుస్తారు. వీరిలోనే కొందర్ని ఎంపిక చేసుకుని వ్యక్తిగతంగా చాటింగ్ చేస్తారు. బ్యాంకు ఖాతా తమకు ఇస్తే కమీషన్ లెక్కన చెల్లిస్తామని ఆశ చూపిస్తారు. డబ్బుకు ఆశపడే కొందరు బ్యాంకు ఖాతాలు, ఇతర రహస్య వివరాలు ఇచ్చి వారి వలకు చిక్కుతున్నారు.

ఇవీ ఉదాహరణలు
సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూరుస్తున్న నగరానికి చెందిన ఇద్దరిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. బేగంపేటకు చెందిన జి.వెంకటేశ్, పాత సఫిల్‌గూడకు చెందిన ఎం.విజయ్ టెలిగ్రామ్ ద్వారా సైబర్ నేరగాళ్లను సంప్రదించారు. వీరిద్దరూ సమకూర్చిన ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు దాదాపు రూ.3 కోట్ల మేర సొత్తు కొల్లగొట్టారు.

ఆన్‌లైన్‌లో వస్తువులకు రేటింగ్ ఇస్తే కమీషన్ ఇస్తామంటూ డబ్బు కొట్టేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడ్ని ఏపీలోని తిరుపతికి చెందిన శిరీష్‌కుమార్‌గా గుర్తించారు. చైనాలోని సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి.. ఇక్కడ మోసాలు చేస్తున్నాడు. నగరంలోని ఓ యువతి నుంచి రూ.60 లక్షలు కాజేశాడు.

మోసగించాక స్నేహం..!
సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వ్యక్తుల్లో కొందరు వారి చేతిలో మోసపోయినవారూ ఉంటున్నారు. టాస్కులు, పెట్టుబడుల పేరుతో మోసగిస్తారు. బాధితులు పరువుపోతుందని పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకురారు. సైబర్ నేరగాళ్ల ఫోన్లను సంప్రదిస్తూ డబ్బు తిరిగి ఇవ్వాలని ప్రాధేయపడుతుంటారు. దీన్ని అవకాశంగా తీసుకునే నేరగాళ్లు వంచిస్తారు. బ్యాంకు ఖాతాలు సమకూర్చాలనో.. తాము చెప్పినట్లు చేస్తే డబ్బు తిరిగి ఇస్తామనో మోసగిస్తూ పావులుగా ఉపయోగించుకుంటున్నారు.

# కనిపిస్తే కరుస్తున్నాయ్



మొయినాబాద్ : హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీల్లో గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు.. ఎవరు కనిపించినా కరుస్తున్నాయి. కుక్కకాట్లతో బాధితులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నా, పిల్లలు మరణిస్తున్నా.. మున్సిపల్ అధికారుల్లో చలనం ఉండటం లేదు. శంషాబాద్ మున్సిపాలిటీలో రెండు రోజుల క్రితం ఏడాది వయసున్న బాలుడిపై కుక్కలు దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇలాంటి పరిస్థితులు శంషాబాద్‌కే పరిమితం కాలేదు. శివార్లలోని నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో స్వైర విహారం చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయించేందుకు, ప్రమాదకరమైన వాటిని ఆసుపత్రులకు తరలించేందుకు కొన్ని మున్సిపాలిటీల్లో బడ్జెట్ లేకపోవడంతో ఆ విషయమే పట్టించుకోవడం మానేశారు.

కుక్కలను కూడా పర్యవేక్షించాలా అంటూ..శునకాల కారణంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శంషాబాద్, నార్సింగి, మణికొండ, తుర్కయాంజల్, ఆదిభట్ల మున్సిపాలిటీలు, బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ల ప్రజలు అధికారులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను అభ్యర్థిస్తున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు.. కుక్కలను కూడా మేమే పర్యవేక్షించాలా? అంటూ వ్యంగ్యంగా అంటున్న పరిస్థితి. రెండుమూడేళ్లుగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, రాత్రివేళ ఇళ్లకు వస్తున్న మహిళలు, ఇంటివద్ద ఉంటున్న వృద్ధులు లక్ష్యంగా దాడులు చేస్తున్నాయి. వారం రోజుల్లో 20మంది గాయపడ్డారు.

నియంత్రణకు నిధుల్లేవ్...
గ్రేటర్ పరిధిలో శునకాల బెడద తీవ్రంగా ఉండడంతో జీహెచ్‌ఎంసీ ఒక ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఒక కుక్కకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించేందుకు రూ.1,500, కుక్కలను పట్టుకునే వాహనాన్ని సమకూర్చుకునేందుకు రూ.లక్ష ఖర్చవుతుంది. నిధులు లేక మున్సిపల్ అధికారులు నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినప్పుడు మాత్రం కు.ని.శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. రెండు, మూడు రోజులు హడావుడి తర్వాత మర్చిపోతున్నారు.

# అక్రమంగా ప్లాస్మా, రక్త నిల్వలు

హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ పద్ధతుల్లో హ్యూమన్ ప్లాస్మా, బ్లడ్, సీరంలను విక్రయిస్తున్న రాకెట్‌ను ఔషధ నియంత్రణ శాఖ(డీసీఏ) అధికారులు గుట్టు రట్టు చేశారు. మూసాపేటలోని భవానినగర్‌లో హెమో సర్వీస్ లేబరేటరీస్ పేరుతో కొనసాగుతున్న సెంటర్‌పై అధికారులు దాడి చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు బ్లండ్ బ్యాంకుల నుంచి వీటిని సేకరించి ఇక్కడ అక్రమంగా నిల్వ చేసి అడ్డదారుల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ రాకెట్‌లో కీలకమైన ఆర్.రాఘవేంద్రనాయక్‌ను డీసీఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎనిమిదేళ్లుగా ఈయన కేంద్రం నడుపుతున్నట్లు గుర్తించారు. తీగ లాగితే ఈ ర్యాకెట్ డొంక మొత్తం కదలింది. మియాపూర్‌లోని మైత్రీనగర్‌లోని శ్రీకర్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు, దారుల్‌షిఫాలోని న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్, ఏపీలోని కర్నూలు జిల్లా ధర్మపేటలోని ఆర్‌ఆర్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుల నుంచి వీటిని సేకరిస్తున్నట్లు గుర్తించారు. ఇలా సేకరించిన ప్లాస్మా, రక్తం, సీరంలను విశాఖలోని అక్టిమస్ బయోసైన్సెస్, బాలానగర్ క్లియాన్స్ ల్యాబ్స్, క్యూపీఎస్ బయోసర్వీస్ ఇండియా లిమిటెడ్, పుణెలోని క్లినోవి రీసెర్చ్ లిమిటెడ్, బెంగళూరులోని సినర్జాన్ ప్రై.లిమిటెడ్, మైక్రో ల్యాబ్స్, నార్విచ్ క్లినిక్ సర్వీసెస్, ఐడీఏ మల్లాపూర్‌లోని శిల్పా మెడికాలిమిటెడ్, మదీనాగూడలోని జన్‌రైజ్ క్లినికల్ రీసెర్చ్, చర్లపల్లి విటమిన్ ల్యాబ్స్‌కు అక్రమ దారుల్లో



విక్రయిస్తున్నట్లు డీసీఏ అధికారులు గుర్తించారు. నిబంధనలు పాటించకుండానే ప్యాకింగ్ చేస్తున్నట్లు తేల్చారు. 150 మిల్లీలీటర్ల ప్లాస్మా బ్యాగ్‌ను రక్త నిధి కేంద్రాల నుంచి రూ.700 కొంటున్న రాఘవేంద్రనాయక్ దాన్ని అడ్డదారుల్లో రూ.3800 విక్రయిస్తున్నట్లు తేలింది. హెచ్ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ, వీడీఆర్ఎల్, మలేరియా పారాసైట్స్ కిట్లను గుర్తించామన్నారు. ఇతరుల ప్రమేయంపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ వి.బి.కమలహాసన్‌రెడ్డి తెలిపారు. దాడిలో డిప్యూటీ డైరెక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పటిష్ఠ ప్రణాళిక.. ప్రతిభ చాటాలిక

జగిత్యాల : పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభంకానున్నాయి. 44 రోజుల సమయం మాత్రమే ఉంది. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పటిష్ఠ ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఓ వైపు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని సన్నద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రణాళిక మేరకు ఎలా చదవాలి.. ఆహారపు అలవాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు...
పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతకు జిల్లా విద్యాశాఖ పలు కార్యక్రమాలు చేపట్టింది. విషయాలు సులభంగా అవగాహన కలిగించేందుకు గణిత, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం విషయాల్లో 'అభ్యాస దీపికలు' అందజేసింది. ఉదయం, సాయంత్రం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా జిల్లా పరీక్షల విభాగం ప్రత్యేకంగా ప్రతినెల ఒక షెడ్యూలు విడుదల చేస్తున్నారు. సిలబస్ పూర్తి చేసి అన్ని పాఠశాలల్లోనూ పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

విద్యార్థులూ ఇలా చేయండి..



ఉదయం 5 గంటలకే లేచి చదవాల్సిన అంశాలపై దృష్టిసారించాలి.
విషయంవారీ అంశాలను ఎప్పటికప్పుడు రాస్తుండాలి.
బట్టీ విధానానికి స్వస్తి పలికి విషయాలపై అవగాహన కలిగి ఉండాలి..
పరీక్షల సమయంలో టీవీ, కంప్యూటర్, చరవాణికి దూరంగా ఉంటే మంచిది.
విద్యార్థులు తమ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి.

వ్యాయామంతో ఒత్తిడి దూరం..
పరీక్షల సమయంలో విద్యార్థులు అధిక సమయం చదివేందుకు కేటాయిస్తారు. ఇది మెదడుపై తీవ్ర ప్రభావం చూపి ఒక్కోసారి చదివింది కూడా మర్చిపోతారు. పరీక్ష కేంద్రాల్లో చదివిన అంశాలు గుర్తుంచుకోలేక ఆందోళన చెందుతారు. ఇందుకోసం ఉదయం, సాయంత్రం వేళ కనీసం అరగంట వ్యాయామం, యోగా, ధ్యానంతో విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి ఉత్సాహం నెలకొంటుందని చెబుతున్నారు.

వారానికి గంటసేపు..
పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా భవిష్యత్తులో రాణించేలా ప్రతి వారానికి ఒక గంట చొప్పున సమయం కేటాయించి ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు అంశాల్లో సూచనలిస్తున్నారు. ఏ రంగంలో నిలవాలంటే ఏం చదవాలి, ఎలా చదవాలనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి వద్ద చేయాల్సిన, చేయకూడనివి వివరిస్తూ తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నారు.

సాత్విక ఆహారమే తీసుకోవాలి : డాక్టర్ శ్రీధర్, ప్రభుత్వ వైద్యులు
పరీక్షల ధ్యాసలో పడి విద్యార్థులు ఆహారం, నిద్రను నిర్లక్ష్యం చేయొద్దు. సమయానికి తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. గోరువెచ్చని నీరు తాగితే జలుబు, జ్వరం వచ్చే అవకాశాలు ఉండవు. బయట దొరికే జంక్‌ఫుడ్, ఇతర చిరుతిళ్లకు పరీక్షల సమయంలో దూరంగా ఉండాలి. ఇంట్లో వండిన పప్పు, దినుసులు, ఆకు కూరలు, పాలు, పండ్లు తీసుకోవాలి. గదిలో కాంతి, స్వచ్ఛమైన గాలి వీచేలా ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలి.

# సిల్వర్ ఓక్స్ విద్యార్థుల ఔదార్యం


నిజాంపేట: బాచుపల్లి సిల్వర్ ఓక్స్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థుల్లో సేవాభావం వెల్లివిరిసింది. పైసా పైసా పొదుపు చేసి జమ చేసిన రూ.24 లక్షలను రెండు స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా అందజేశారు. విద్యార్థులకు సమాజంపై బాధ్యతను చాటేందుకు పాఠశాల యాజమాన్యం 20 ఏళ్లుగా 'కాయిన్స్ ఫర్ ది కంట్రీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏటా పాఠశాల ఆరంభంలోనే ప్రతి విద్యార్థికి మట్టితో చేసిన హుండీ ఇస్తారు. పాకెట్ మనీని దుబారా చేయకుండా, పుట్టిన రోజు, ఇతర వేడుకలకు దూరంగా ఉండి దాచుకున్న డబ్బును అందులో వేస్తారు. ఈ ఏడాది 3,300 మంది నుంచి రూ.24,36,007 జమయ్యాయి. ఇందులోంచి రూ.19,36,007లను వరంగల్ జిల్లా కల్లెడలోని రూరల్ డెవలప్‌మె



ంట్ ఫౌండేషన్(ఆర్‌డీఎఫ్)కు ఇచ్చారు. మిగతా రూ.5 లక్షలను గుంటూరు జిల్లా నర్సరావుపేటలోని నీడీ ఇల్లిటరేట్ చిల్డ్రన్ ఎడ్యుకేషన్(నైస్)కు అందజేశారు.పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు వి.ధనుంజయ, నీలిమా, ప్రిన్సిపల్ సీతామూర్తి, ఆర్‌డీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వందితారావు, కిరణ్, రంజిత పాల్గొన్నారు. మరో రెండు బ్రాంచీల నుంచి.. సిల్వర్ ఓక్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉన్న బీరంగూడలోని ఓక్‌దాలే, బౌరంపేటలోని ఓక్ విండోస్ పాఠశాలల్లోనూ విద్యార్థులు సమకూర్చిన రూ.4,37,732ను ఆర్‌డీఎఫ్ సంస్థకే అందజేశారు.

# నిర్వహణ లేక నిరుపయోగం

తాండూరు: జిల్లాలోని తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని 39 గ్రామాలకు ఎద్దడి లేకుండా తాగునీటిని సరఫరా చేసిన పంప్‌హౌస్‌ను పునరుద్ధరిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన వారే కావడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారిన పంప్‌హౌస్‌ను తిరిగి వినియోగంలోకి తెస్తారనే ఆశలు చిగురిస్తున్నాయి. 1999లో ప్రారంభం: కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లోని 39 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో 1999లో రూ.6.50 కోట్లు వ్యయం చేసి తాండూరు పట్టణ శివారు కాగ్నానది ఆధారంగా రక్షిత మంచినీటి సరఫరా పథకం ఏర్పాటైంది. కాగ్నానదిలో రెండు చోట్ల లోతుగా బావులు తవ్వి, అందులోకి ఇసుక చేరకుండా పటిష్టమైన కప్పులతో మూసేశారు. ఈ బావుల నుంచి నీటిని తోడేందుకు ప్రత్యేకంగా పంప్‌హౌస్‌ను నిర్మించారు. 100 అశ్విక శక్తిగల రెండు మోటార్లను అమర్చారు. బావుల నుంచి నీటిని సరఫరా చేసేందుకు 40 కిలోమీటర్లకు పైగా పొడవుతో గొట్టాలను విస్తరించారు. కొడంగల్ మండలం అప్పాయిపల్లి, కొడంగల్, యాలాల మండలం దౌలాపూరులో నాలుగు సంపులను నిర్మించారు. వీటిలోకి నీటి సరఫరా కాగానే ప్రత్యేక మోటార్ల ద్వారా నిర్ణీత గ్రామాలకు తాగునీటి సరఫరా వ్యవస్థను రూపొందించారు. కొడంగల్ పట్టణానికి కూడా ఇక్కడి నుంచే నీటి సరఫరా జరిగేలా చూశారు. 2010 వరకు ప్రజలు నీటి ఎద్దడి కలగలేదు. అనంతరం నిర్వహణ లేక గొట్టాలు పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. ఫలితంగా 39 గ్రామాలకు నీరందించాల్సింది.. తాండూరు నియోజకవర్గం యాలాల మండలంలోని 10 గ్రామాలకు, కొడంగల్ మండలంలో 5 గ్రామాలకు మాత్రమే 2016 వరకు నీరందుతోంది. నిర్వహణ కోసం ఏటా మంజూరయ్యే రూ.55లక్షలు రాకపోవడంతో పథకం



నిరుపయోగంగా మారింది.

గతంలో పరిశీలన కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కాగ్నానది ఒడ్డున నిర్మించిన తాగునీటి సరఫరా పథకాన్ని పరిశీలించారు. గొట్టాల మరమ్మతుకు కృషి చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్‌రెడ్డి.. నిరుపయోగంగా మారిన ఈ పథకాన్ని పునరుద్ధరిస్తారనే ఆశలు ఆయా గ్రామాల ప్రజల్లో నెలకొన్నాయి.

తాజాగా గొట్టాల తొలగింపు కర్ణాటక చించోళి నుంచి తాండూరు, కొడంగల్ పట్టణాల మీదుగా రూ.631 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 167(ఎన్) జాతీయ రహదారి నిర్మాణానికి తాగునీటి సరఫరా గొట్టాలు అడ్డుగా వచ్చాయి. దీంతో గుత్తేదారు వాటిని తొలగించారు. ప్రధాన రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే గొట్టాలు మాత్రం అలాగే ఉన్నాయి.

# ఇటుక బట్టీ.. నిబంధనలు పక్కనబెట్టి

పెద్దేముల్ : ఇటుక బట్టీలు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ కొనసాగిస్తున్నారు. కొద్దిపాటి భూమి దొరికితే చాలు ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుకల తయారీ మొదలు పెడుతున్నారు. అక్రమంగా బట్టీలు కొనసాగుతున్నా.. రెవెన్యూ, మైనింగ్, విద్యుత్తు, గ్రామ పంచాయతీ అధికారులు మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి మండలంలో ఐదారు బట్టీలు కొనసాగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అంతకు రెట్టింపు స్థాయిలో బట్టీలు ఉన్నాయి. అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. పెద్దేముల్ మండలం కందనెల్లి తండా, తాండూరు మండలం అంతారం తండా, యాలాల, బషీరాబాద్ మండలాల్లో ఇటుకల వ్యాపారం జోరుగా జరుగుతోంది.

అనుమతులు లేకుండా: ఇటుక బట్టీల ఏర్పాటుకు రెవెన్యూ, గనులు, విద్యుత్తు, కార్మిక శాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. గ్రామ



పంచాయతీల నుంచి ఎన్‌ఓసీలు తీసుకోవాలి. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకుని బట్టీలు నిర్వహించాలి. కానీ ఎక్కడ నిబంధనలను పాటించడం లేదు. వ్యవసాయ భూముల్లో బట్టీలను నెలకొల్పి ఉచిత విద్యుత్తును వినియోగిస్తున్నారు. బాల కార్మికులతో పనులు చేయిస్తున్నారు. తహసీల్దార్ నుంచి అనుమతి తీసుకుని నాలా వచ్చిన తర్వాత బట్టీలు కొనసాగాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం వల్ల ప్రభుత్వానికి సగటున ఏటా రూ.2 కోట్ల ఆదాయం నష్టం జరుగుతోంది.

చెరువుల మట్టి తరలింపు: ఇటుకల తయారీకి చెరువుల్లోని నల్లని ఒండ్రు మట్టిని వినియోగిస్తారు. గ్రామాల సమీపంలోని చెరువుల్లో అక్రమంగా మట్టిని తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. నీటిపారుదల, గ్రామ పంచాయతీల నుంచి అనుమతి తీసుకుని నిబంధనల ప్రకారం మట్టిని తరలించాలి. కానీ అర్ధరాత్రి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. వ్యాపారులతో అధికారులు చేతులు కలపడంతో పంచాయతీలకు రావాల్సిన ఆదాయం రావడం లేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇటుక బట్టీలకు సంబంధించి ఎక్కడ, ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా కొనసాగుతున్న బట్టీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. కిషన్, తహసీల్దారు, పెద్దేముల్.

# ఆమ్యామ్యా లేకపోతే అనుమతుల్లేవ్



హైదరాబాద్: కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)లో అవినీతి రాజ్యమేలుతోంది. పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణలో కీలకమైన సీఎఫ్ఇ(కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్), సీఎఫ్‌వో(కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్), రెన్యువల్, అనుమతుల జారీకి డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ పరిశ్రమల నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయానికి వెళ్తే అనుమతులు జారీ అయ్యేసరికి కనీసం 6-10 నెలలు పడుతోందంటున్నారు. ఇక్కడి ఓ ఉన్నతాధికారి పేరు చెప్తేనే వణికిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తనదైన శైలిలో వసూళ్లకు పాల్పడుతూ నిర్వాహకులను ముప్పుతిప్పలు పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతుల కోసం వేచిచూస్తున్న నిర్వాహకులు విసిగిపోయి.. 'ఏమైనా కావాలా...? అంటూ అడిగేవరకు సహనాన్ని పరీక్షించి, బంగారం, బహుమతుల రూపంలో వసూళ్లకు పాల్పడటం పరిపాటిగా మారింది. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారమున్నా చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గడువులోగా తేల్చేయాలి..

ఏటా హైదరాబాద్, రంగారెడ్డి, నారాయణ్‌పేట్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ జిల్లాలకు చెందిన 300-400 పరిశ్రమల నుంచి సీఎఫ్‌వో, సీఎఫ్ఈ, రెన్యువల్ కోసం దరఖాస్తులు వస్తుంటాయి. వీటికి నిర్ణీత వ్యవధిలో ప్రక్రియ పూర్తి చేసి అనుమతివ్వాలి.. లేదా రద్దు చేయాలి. ప్రాంతీయ కార్యాలయంలో సదరు అధికారికి మాత్రం ఇవేమీ పట్టవు.

రెన్యువల్ కోసం వచ్చినా..: సాధారణంగా పరిశ్రమల నిర్వాహకులు 3, 5, 7 ఏళ్లకోసారి రెన్యువల్ చేయించుకోవాలి. అలా రెన్యువల్ కోసం వచ్చే ఫైళ్లనూ నెలలపాటు తన వద్దే పెట్టుకొని ప్రక్రియను ముందుకు సాగనివ్వడం లేదని, కొత్తగా ఏర్పాటుచేసే పరిశ్రమలకు సంబంధించి అనేక కొర్రీలు సాకుగా చూపుతూ కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం కాలుష్య నియంత్రణ పాటిస్తున్నారా.. లేదా పరిశీలించి అవసరమైతే బృందాన్ని పంపి నమూనాలు సేకరించి పరీక్ష చేయించి నివేదిక ఆధారంగా రెన్యువల్ చేయాలి. కానీ ఇవేమీ పట్టించుకోరు.

అండదండలతోనే..ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారుల అండతోనే ఇలా రెచ్చిపోతున్నారని పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారు. ఓ కంపెనీని పీసీబీ జాబితాలో ప్రైవేటు లిమిటెడ్‌గా మార్చేందుకు 4 నెలలు ఇబ్బంది పెట్టారని దాని నిర్వాహకుడు వాపోయారు. చెప్పులరిగేలా తిరుగుతుంటే అప్లికేషన్ రాలేదని, హార్డ్‌కాపీ రాలేదని, జెడ్‌వోకు దరఖాస్తు ఇవ్వాలని, తనను ఎందుకు కలవలేదంటూ ముప్పుతిప్పలు పెట్టారని ఆవేదనవ్యక్తంచేశారు. ప్రధాన కార్యాలయంలో కుటుంబ సభ్యుడు, సన్నిహితులు పనిచేస్తుండటంతో అటు నుంచి వసూళ్లకు పాల్పడుతుంటారని తెలిసింది.

# హేక్కృష్ణా.. మూసీని మూసేశారు!



హైదరాబాద్: రెండు వందల అడుగుల దూరంలో బాహ్య వలయ రహదారి.. రహదారికి అడ్డంగా మూసీ. ఇంకేముంది.. సమీపంలో తాము నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల యజమానులకు సూర్యోదయం బాగుంటుందన్న ఉద్దేశంతో దర్జాగా నదిని ఆక్రమించేశారు. ఏకంగా యాభైమీటర్ల వరకు లోపలికి చొచ్చుకుపోయింది. నార్సింగి సమీపంలో బహుళ అంతస్తులు, టవర్లు నిర్మిస్తున్న ఓ స్థిరాస్తి సంస్థ నిర్వాకమిది. పనులు జరుగుతున్న తీరుపై ఫిర్యాదులు రాగా, మూడునెలల కిందట హెచ్ఎండీఏ అనుమతులు రద్దు చేసింది. మూసీ నది చెంత బఫర్‌జోన్ అని తెలిసినా స్థిరాస్తి సంస్థకు అనుమతులు ఎందుకు ఇచ్చారన్నది బహిరంగ రహస్యం. అవినీతి నిరోధకశాఖ అధికారులు ఇటీవల అరెస్టుచేసిన హెచ్ఎండీఏ మాజీ అధికారి ఈ అనుమతుల తెరవెనుక ఉన్నారని సమాచారం.

నిర్మాణ వ్యర్థాలు, ప్లాస్టిక్ కంచెలతో..తొలుత ఆ సంస్థవారు నిర్మాణ వ్యర్థాలతో ఇరవై అడుగులు, ప్లాస్టిక్ కంచెలతో మరో ముప్పై అడుగులు ఆక్రమించుకున్నారు. నీటిపారుదలశాఖ, హెచ్ఎండీఏ అధికారులను మచ్చిక చేసుకుని అనుమతులు తీసుకున్నారు. దీంతో మూడునెలల కిందటిదాకా పనులు సజావుగా సాగాయి. మూసీనది వికారాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా గండిపేట్ నుంచి బాపూఘాట్ వరకు ప్రవహించి ఈసీతో కలిసి నల్గొండ జిల్లాదాకా వెళుతుంది. నదిపై పలుచోట్ల ఆక్రమణలున్నా, గండిపేట్ నుంచి నార్సింగి- బాపూఘాట్ వరకు మరీ ఎక్కువ.

చర్యలు కరవు: మూసీలోనే నిర్మాణాలు కొనసాగుతుండటం, నార్సింగి రహదారికి సమీపంలోనే ఆక్రమణలు కనిపిస్తుండటంతో నాలుగునెలల కిందట.. అటువైపుగా వెళ్తున్న అప్పటి మంత్రి గమనించి అధికారులను ప్రశ్నించారు. ఆయన ఆదేశాలతో హెచ్ఎండీఏ అనుమతులు రద్దుచేసింది. తరువాత చర్యల్లేవు. బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టిన సంస్థపై ఇరిగేషన్ అధికారులు, హెచ్ఎండీఏ చర్యలు చేపట్టాలి. భారీ జరిమానాతో పాటు ఆక్రమణలను తీయించాలి. అధికారులు స్పందించకపోవడంతో స్థిరాస్తిసంస్థ ప్రతినిధులు మళ్లీ పనులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# విదేశీ సాంకేతికత.. ఉండదిక తాగునీటి వృథా

హైదరాబాద్: రాజధాని పరిధిలో తాగునీరు వృథా కాకుండా ఉండేందుకు జలమండలి చేపట్టిన సరికొత్త ప్రయోగం ఫలించింది. రిజర్వాయర్ల వద్ద ఇజ్రాయెల్ టెక్నాలజీ వినియోగించి.. ఒక్క చుక్క కూడా నీరు వృథాగా పోకుండా నిలువరించారు. నీటిని నింపాల్సిన సమయంలో ప్రత్యేకంగా సిబ్బంది అవసరమూ ఉండదు. అంతా ఆటోమెటిక్‌గా సాగే ఈ కొత్త వ్యవస్థ కొన్ని రిజర్వాయర్ల వద్ద విజయవంతమైంది. దీంతో మిగిలిన అన్ని చోట్ల ఏర్పాటుచేసేందుకు అధికారులు ఏర్పాటుచేస్తున్నారు. నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జలమండలి దాదాపు 250 వరకు రిజర్వాయర్లను చాలా ఏళ్ల కిందటే నిర్మించింది. ప్రతి చోట కొంతమంది సిబ్బందిని ఏర్పాటుచేశారు. సరఫరా జరిగినప్పుడల్లా సంబంధిత సిబ్బంది వాల్వు తిప్పి నీటిని ఎక్కించేవారు. కొన్నిసార్లు రిజర్వాయర్ నిండి వృథాగా నీరు పోయేది. శివార్లలో సిబ్బంది లేని చోట రిజర్వాయర్ల నుంచి ఇలా నీటి వృథా అధికంగా ఉంటోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి రిజర్వాయర్ల వద్ద ఆటోమెటిక్ వ్యవస్థ ఏర్పాటుచేయాలని కొద్దికాలం కిందట అప్పటి జలమండలి ఎండీ దానకిషోర్ నిర్ణయించారు. ఇజ్రాయెల్ సాంకేతికతతో నడిచే వ్యవస్థ ఏర్పాటుకు ఒక సంస్థకు పని అప్పగించారు. కొన్ని చోట్ల ఏర్పాటుచేశాక ఆయన పూర్తిస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. తరువాత శివారు ప్రాంతంలోని 41 రిజర్వాయర్ల వద్ద ఏర్పాటుకు ఆదేశాలు జారీచేశారు. రూ.7 కోట్ల వరకు వ్యయమవుతుందని అంచనా వేశారు. చాలా చోట్ల దీన్ని ఏర్పాటుచేశామని అధికారులు తెలిపారు.

పని చేసే విధానమిదీ..

ఈ కొత్త వ్యవస్థను రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఆర్ఎంఎస్) అంటున్నారు. రిజర్వాయర్ లోపలికి తాగునీటి వెళ్లే ప్రధాన పైపువద్ద హైడ్రాలిక్ కంట్రోల్ వాల్వు ఏర్పాటుచేస్తున్నారు. దీనికి ముందే మీటరుతో పాటు సెన్సర్ ఏర్పాటుచేశారు. రిజర్వాయర్ లోపల మరో సెన్సర్ వ్యవస్థ ఏర్పాటుచేస్తారు. వీటన్నింటి అనుబంధంగా కంట్రోల్ యూనిట్ ఏర్పాటుచేస్తారు. దీంతో జలమండలి ప్రధాన కార్యాలయంలోని మానిటరింగ్ వ్యవస్థను అనుసంధానం చేశారు. రిజర్వాయరు లోపలికి ఎంత నీరు వెళ్లాలి, ఎంత వేగంతో వెళ్లాలి, ఏ



సమయంలో వెళ్లాలన్న దాన్ని ముందుగానే రిజిస్టర్ చేస్తే.. ఆ ప్రకారమే లోపలికి వెళ్లేలా కంట్రోల్ యూనిట్ పర్యవేక్షిస్తుంది. ఇదంతా ఆటోమెటిక్‌గానే జరుగుతుంది. రిజర్వాయరు వద్ద సిబ్బంది ఉండాల్సిన అవసరం లేదు. ఒక ప్రాంతంలో నాలుగు రిజర్వాయర్లు ఉంటే నాలుగింటి వద్దా ఈ వ్యవస్థను ఏర్పాటుచేస్తే ముందుగా నమోదుచేసిన వివరాల ప్రకారం అన్నింటికీ సమానంగా నీరు వెళ్లేలా చేస్తుంది. అవి నిండిన తరువాత ఆటోమేటిక్‌గా ఈ వ్యవస్థ ప్రధాన వాల్వును ఆపుతుంది. ఈ కొత్త వ్యవస్థతో రిజర్వాయర్ దగ్గర నీటి సరఫరా, ఒత్తిడి ఎలా ఉంది.. ఎంత నీరు వినియోగమైందన్న వివరాలన్నీ జలమండలి కేంద్ర కార్యాలయంలో ఆటోమెటిక్‌గా నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ వ్యవస్థ వినియోగం కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను జలమండలి సిబ్బందికి ఇచ్చారు. ఈ యాప్‌తో వారు తెరిచి ఉన్న చోటనుంచే వాల్వు ఆన్-ఆఫ్ చేయొచ్చు. విద్యుత్ కనెక్షన్ అవసరం లేకుండా నీటి ఒత్తిడిని బట్టి పనిచేయడం ఈ కొత్త విధానం మరో ప్రత్యేకత.

# భూములపై అటవీశాఖ న్యాయ పోరాటం

హైదరాబాద్ : రాజధాని పరిసర ప్రాంతాల్లో భూముల విలువ రూ.కోట్లకు పెరగడంతో ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. వందల ఏళ్ల క్రితం రెవెన్యూ రికార్డులు సక్రమంగా లేకపోవడంతో సర్వే నంబర్లు మారిపోతున్నాయి. సర్కారు భూములు ప్రైవేటు పట్టా భూముల జాబితాలోకి చేరుతున్నాయి. మహేశ్వరం పరిధిలో, తుక్కుగూడ ఓఆర్ఆర్ సమీపంలో రూ.1,600 కోట్ల విలువైన 384 ఎకరాలపై వివాదం నెలకొనడంతో రంగారెడ్డి జిల్లా అటవీ అధికారులు హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నారు.

50 ఏళ్ల క్రితమే పెంపకానికి నిర్ణయం

మహేశ్వరం సమీపంలోని ఖాళీగా ఉన్న భూముల్లో వనాలు పెంచేందుకు రంగారెడ్డి అటవీశాఖ అధికారులు 50 ఏళ్ల క్రితం నిర్ణయించారు. రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వంద ఎకరాల్లో నీలగిరి మొక్కలు, 284 ఎకరాల్లో మొక్కలు పెంచేందుకు వీలుగా ఖాళీగా ఉంచాలని అధికారులు నిర్ణయించారు. 23 ఏళ్ల క్రితమే వంద ఎకరాల్లో నీలగిరి మొక్కలు నాటారు. భూములను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకుంటుండగా, మహేశ్వరం మండలానికి చెందిన సిరాజుద్దీన్‌తో పాటు కొందరు.. తమవంటూ న్యాయస్థానాన్ని



ఆశ్రయించారు. 1954-55లో ఖస్రా పహాణిలో తమ పేర్లు ఉన్నాయని హైకోర్టును ఆశ్రయించారు. మూడు నెలల క్రితం ఆ భూములు సిరాజుద్దీన్, ఇతరులవేనంటూ హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు నిచ్చారు. సింగిల్ జడ్జి తీర్పుపై అటవీశాఖ అప్పీల్ వెళ్లింది. అవి ప్రభుత్వ భూములేనని మరిన్ని సాక్ష్యాలు, రుజువులను న్యాయస్థానానికి అందజేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులు అమలు చేయకూడదంటూ హైకోర్టు కొద్దిరోజుల క్రితం పేర్కొన్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

షెత్వార్ రికార్డులు... ఖాస్రా పహాణీలు..

షెత్వార్ రికార్డుల ప్రకారం మహేశ్వరంలో భూములు తమవంటూ అటవీఅధికారులు చెబుతున్నారు. 1929 నాటి షెత్వార్ రికార్డుల ప్రకారం 384 ఎకరాలను 'మషూరా జంగిల్' (అటవీ భూమి)గా ఉన్నాయని, దశాబ్దాలుగా తమ అధీనంలోనే ఉన్నాయంటున్నారు. మరోవైపు ఈ భూములన్నీ తమ పూర్వీకుల నుంచి వచ్చాయని ఖస్రా పహాణీల్లో తమ కుటుంబసభ్యులు ఖాజా మొహియుద్దీన్, కరీముద్దీన్, హబీబుద్దీన్‌ల పేర్లు ఉన్నాయని సిరాజుద్దీన్ కోర్టులో తెలిపారు. ఈ రికార్డుల్లో మార్పులు ఎలా జరిగాయనేది రెవెన్యూ అధికారులు పరిశోధిస్తే మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి.

# మెక్కిన సొమ్ము కక్కిస్తారా?

కరీంనగర్: గట్టుదుద్దెనపల్లి సొసైటీలో అక్రమాలపై క్రమంగా కదలిక కనిపిస్తోంది. గతంలో ఇక్కడి ప్రాథమిక సహకార పరపతి సంఘంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం రచ్చకెక్కిన సంగతి తెలిసిందే. గత పాలకవర్గాలతోపాటు పలువురు సిబ్బంది కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారని జిల్లాధికారులు గుర్తించారు. పలుమార్లు జరిపిన విచారణల్లో వాస్తవాల నిగ్గు తేల్చారు. బాధ్యులుగా దాదాపు 35 మందిని గుర్తించారు. వీరందరికి గతంలోనే సర్‌ఛార్జీలను అందించారు. కొందరు తమకు సంబంధంలేదనే పంథాలో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరో వైపు సహకార శాఖ అధికారులు మాత్రం చేజారిన డబ్బులను ఎలాగైనా ప్రభుత్వ ఖజానాకు తిరిగి రాబట్టేందుకు వారి వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించని మిగతా బాధ్యులకు ఇటీవల వారి ఆస్తులను జప్తు చేసేందుకు జిల్లాధికారులు తాఖీదులు ఇచ్చారు. మొత్తంగా రూ.60 లక్షల విలువ చేసే వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంపై అందరిలో ఆసక్తి నెలకొంది. గడిచిన రెండున్నరేళ్లుగా ఈ సహకార సంఘంలో అక్రమాల కథ ఎటూ తేలడం లేదు. రైతుల ప్రయోజనాన్ని ఆకాంక్షించి ఏర్పాటైన సంఘంలో ఇలా అవినీతి రాజ్యమేలడం, ఇష్టానుసారంగా ప్రజల పైసలు పరులవశమవడం ఆందోళన కలిగించింది.

రూ.3 కోట్లకుపైగా.. పక్కదారి..

దాదాపు మూడేళ్ల కిందట మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి సహకార పరపతి సంఘంలో ఆడిట్ జరిపినప్పుడు అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. సహకార శాఖ అధికారులు విచారణలు జరిపారు. అక్కడి రైతుల ధాన్యం సహా పెట్రోల్‌బంక్ వ్యవహారాల్లో ఇష్టానుసారంగా చేతివాటాలను చూపించారు. ఇలా మొదట రూ.4,17,74,324 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ఈ మొత్తాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. 2022 జనవరి 5న మొదటిసారి



జిల్లాధికారులు రూ.49 లక్షలకుపైగా మొత్తాన్ని రికవరీ చేసేందుకు సర్‌ఛార్జీలను జారీ చేశారు. ఈ విషయమై ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం ఇంకా కొలిక్కిరాలేదు. తరువాత మిగతా సొమ్ము రూ.3.58 కోట్లకు సంబంధించి గతేడాది జులై 18న మరోసారి సర్‌ఛార్జీలు అందించారు. అయినా ఇప్పటి వరకు ఈ సొమ్ము తిరిగి ఖజానాకు జమ కాకపోవడంతో తాజాగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ సొసైటీ విషయంలో తీసుకుంటున్న చర్యలపై జిల్లా సహకారశాఖ అధికారి రామానుజచార్యులు వివరణ ఇస్తూ పక్కదారి పట్టిన డబ్బులను తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. సహకార బ్యాంకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఓఎస్‌డీ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. 10 మంది ఆస్తులను జప్తు చేసేందుకు ఇటీవల నోటీసులు అందించామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజాధనాన్ని తిరిగి రాబడుతామన్నారు.

# పనితీరులో వెనుకబడి!

జనగామ : ప్రభుత్వ పాఠశాలల పనితీరును లెక్కిస్తూ పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ఫర్ డిస్ట్రిక్ట్ 2021-22(పీజీఐడీ)లో జిల్లాల వారీగా కేంద్ర ప్రభుత్వం గ్రేడ్‌లను ప్రకటించింది. ఇందులో ఉమ్మడి వరంగల్ పరిధిలోని జిల్లాలు నామమాత్రపు ఫలితాలే సాధించాయి. వరంగల్, హనుమకొండ మాత్రమే 'ఉత్తమ్'గా నిలిచాయి. మిగతా మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాలు ప్రచేష్ట-1తో సరిపెట్టుకున్నాయి.

**ఇలా ఉంటే ఉత్తమ గ్రేడ్**

హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ అభ్యసన్నోత ప్రాథమిక పాఠశాలలో 552 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ బాల, బాలికలకు ప్రత్యేక వసతులతో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. తరగతి గదుల్లో అధునాతన డ్యూయల్ డెస్క్‌లు సమకూర్చారు. డిజిటల్ బోధన, పిల్లలకు ఉపయుక్తమైన పుస్తకాలతో పాటు జనరల్ నాలెడ్జ్, కథలు, కంప్యూటర్ తదితర పుస్తకాలతో గ్రంథాలయం ఉన్నాయి. దాతల సాయంతో శుద్ధజలం పరికరం ఏర్పాటు చేశారు. అధునాతన వంటశాలను నిర్మించారు. పాఠశాల ఆవరణ అంతా పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంటోంది.

ఇలా అన్ని పాఠశాలల్లో సాకర్యాలు కల్పిస్తే పనితీరు మెరుగుపడి జిల్లాలకు మంచి గ్రేడ్ వచ్చే అవకాశం ఉంది.

**ఎలా లెక్కించారంటే..** పాఠశాలల సామర్థ్యాలను అంచనా వేయడానికి కేంద్ర విద్యాశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక నిపుణులు, ఏజెన్సీల ప్రతినిధుల బృందాల సభ్యులు దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించి వివరాలు తీసుకున్నారు. పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ)ను ఆరు ప్రామాణికాలతో పాటు 83 కోణాల్లో జిల్లాల



పనితీరును లెక్కించారు. గరిష్ఠంగా 600 మార్కులు కేటాయిస్తారు. 90 శాతానికి పైగా మార్కులు సాధించిన జిల్లాలకు దక్ష్, 81-90 శాతం మధ్య పొందిన వాటికి ఉత్కర్ష్, 71-80 శాతం మధ్య ఉంటే అతి ఉత్తమ్, 61-70 శాతం పొందిన వాటికి ఉత్తమ్, 51-60 శాతం మార్కులు దక్కిన వాటికి ప్రచేష్ట-1, 41-50 శాతం మధ్య ఉన్న వాటికి ప్రచేష్ట-2, 21-30 శాతం మార్కులు సాధించిన వాటికి ఆకాంక్షి-1, 11-20 శాతం మార్కులు వచ్చిన వాటికి ఆకాంక్షి-2, 10 శాతం ఉన్న వాటికి ఆకాంక్షి-3 గ్రేడ్‌లు కేటాయిస్తారు.

**విద్యా ప్రమాణాలు తెలుస్తాయి..డా.ఎండీ.అబ్దుల్‌హై, జిల్లా విద్యాశాఖ అధికారి, హనుమకొండ**

జాతీయ, అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు పెంచుకోవడానికి గ్రేడులు తోడ్పడతాయి. ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నామో తెలుసుకోవచ్చు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ఫలితాలను మెరుగుపరుచుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషి చేస్తాం.

# పట్టణాలకు వలస.. వసతులే సమస్య

జనగామ : పల్లెలు పట్టణాలవుతున్నాయి.. పంట పొలాలు కనుమరుగై ఆకాశ హర్మ్యాలు వెలుస్తున్నాయి. వీటన్నిటికీ కారణం జనాభా విపరీతంగా పెరుగుతుండటమే... ఉమ్మడి వరంగల్.. ఆరు జిల్లాలుగా విడిపోయిన తర్వాత ప్రతి చోట జనాభా క్రమంగా పెరిగిపోతోంది. వరంగల్ కార్పొరేషన్ సహా జిల్లా కేంద్రాలుగా మారిన పురపాలక సంఘాల్లోనూ, పురపాలికలుగా మారిన పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించు కుని ఉమ్మడి జిల్లా పట్టణాల్లో జనాభా పెరుగుదల కారణంగా వస్తున్న మార్పులు, కలుగుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై ప్రత్యేక కథనం. వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాటి వినియోగంతో వెలువడే కర్బన ఉద్గారాలతో కాలుష్యం పెరుగుతోంది. కొత్త కాలనీల్లో భవనాల నిర్మాణం వల్ల పచ్చదనం కోల్పోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది.

లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటల ఆక్రమణలతో ప్రణాళిక లేకుండా ఇబ్బడి ముబ్బడిగా భవన నిర్మాణాలు వెలుస్తుండటం వల్ల భారీ వర్షాలకు వరదలతో నీటమునుగుతున్నాయి. రెండేళ్లలో వరంగల్ నగరంలో భారీ వర్షాలకు అనేక కాలనీలు నీట మునిగాయి. జిల్లాల విస్తరణకు ముందు ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధి, సౌకర్యవంతమైన జీవనం కోరుతూ వరంగల్ నగరం బాట పట్టారు. కొత్త జిల్లాలుగా ఏర్పడిన మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లా కేంద్రాల్లోనూ పట్టణీకరణ వేగం పుంజుకుంటోంది. వరంగల్ నగరంలో ప్రతి రోజూ ఏదో విధంగా పని దొరుకుతుండడం, మెరుగైన విద్య, వైద్యసదుపాయాలు అందుబాటులోకి రావడం, వంటి కారణాలు అక్కడ పట్టణీకరణకు దారితీస్తోంది. కొత్తగా ఆవిర్భవించిన జిల్లాల్లోనూ ప్రభుత్వం వైద్య, విద్యా సదుపాయాలను మెరుగుపరుస్తుండడం, కొత్త కట్టడాల నిర్మాణం పెరుగుతుండడంతో వివిధ వర్గాలకు ఉపాధి లభిస్తోంది. దీంతో ఆయా జిల్లా కేంద్రాలుగా ఉన్న మున్సిపాలిటీల్లోనూ జనాభా పెరుగుదల కనిపిస్తోంది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లోనూ ఒత్తిడి పెరుగుతోంది. జిల్లాల్లో పారిశ్రామిక రంగం వృద్ధి చెందితే హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ లాంటి పెద్ద నగరాలకు ఉపాధి కోసం వెళ్లే వారి సంఖ్య తగ్గి ఇక్కడే జనాభా రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో ఈ పట్టణాల్లో వసతుల కల్పన సవాలుగా మారనుంది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా వసతుల కల్పనపై ప్రత్యేక చొరవ చూపిస్తేనే సమస్యలు తీరుతాయి.

**ఇలా చేద్దాం** పట్టణాల్లో శివారు కాలనీలపై అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించాలి. గ్రామాల్లో విద్య, వైద్యంతో ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గుతోంది. పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని మరింత సమర్థంగా నిర్వహించాలి. పట్టణాల్లో ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించాలి. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలి.

# నగరం నిద్రపోతున్న వేళ



ఖమ్మం: విచ్చలవిడి గంజాయి వినియోగం అనేక దుష్పరిణామాలకు దారి తీస్తోంది. ఖమ్మం నగరంలో గంజాయి మత్తులో ఆకతాయిలు నానా హంగామా సృష్టిస్తున్నారు. రాత్రిపూట ఇష్టారాజ్యంగా సంచరిస్తూ తారసపడిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. ఈక్రమంలో రైల్వే ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది.

**రాత్రి 11 గంటలు దాటితే..**

ఖమ్మం నగరంలో గంజాయి వినియోగం విపరీతంగా పెరిగింది. రాత్రి 11 గంటలు దాటితే అడ్డాల్లో ఆకతాయిలు గుంపులుగా సంచరిస్తున్నారు. గంజాయి, మద్యం తాగేందుకు ప్రధానంగా రైల్వేట్రాక్ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. మత్తులో రాత్రిపూట విధులు నిర్వర్తించే ఉద్యోగులు, బాటసారులపైనా దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల ఈ సంస్కృతి విచ్చలవిడిగా పెరిగింది. రామన్నపేట, దానవాయిగూడెం, రాపర్తినగర్ బ్రిడ్జి, సారథినగర్, గాంధీచౌక్, శ్రీనివాసనగర్, అగ్రహారం, ధంసలాపురం, పందిళ్లపల్లి రైల్వేట్రాక్‌ల వద్ద ఆకతాయిలు వీరంగం సృష్టిస్తున్నారు.

**మూడేళ్లుగా బిక్కుబిక్కుమంటూ..**

సుమారు మూడేళ్లుగా భయానక పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. ట్రాక్‌మెన్లు, సిగ్నలింగ్, ఆపరేటింగ్ సిబ్బంది రాత్రిపూట రైల్వేట్రాక్‌ల పనితీరు, భద్రతను పర్యవేక్షిస్తుంటారు. ఈక్రమంలో మత్తులో ఉన్న ఆకతాయిలు మారణాయుధాలతో వారిపై దాడులకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. జేబుల్లోని పర్సులు, సెల్‌ఫోన్లు లాక్కుంటున్నారు. రాత్రిపూట విధులంటేనే రైల్వే సిబ్బంది హడలిపోతున్నారు. ఉద్యోగులపైనే కాదు రైళ్లపైనా ఆకతాయిలు దాడులకు తెగబడుతున్నారు. గతంలో దానవాయిగూడెం, రామన్నపేట, ప్రకాశ్‌నగర్ వంతెన సమీపంలో వివిధ రైళ్లపై రాళ్లు విసిరారు. ఖమ్మం నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అల్లరిమూకల ఆగడాలు పెచ్చుమీరుతున్నా పోలీసు, జీఆర్పీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖమ్మం-3 పట్టణ ప్రాంతంలో మూడు రోజుల క్రితం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రైల్వేట్రాక్‌పై ట్రాక్‌మెన్ రిషీశ్వర్ పెట్రోలింగ్ చేస్తున్నారు. గంజాయి మత్తులో ఓ యువకుడు కత్తితో దాడికి యత్నించాడు. అతడి జేబులోని డబ్బు, సెల్‌ఫోన్ లాక్కోవాలని భావించాడు. ట్రాక్‌మెన్ ప్రతిఘటించి అక్కడి నుంచి బయటపడ్డారు. మరుసటి రోజు సహోద్యోగులతో కలిసి జీఆర్పీ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

ఖమ్మంలో గత నెలలో నర్తకి థియేటర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై సిగ్నల్ వ్యవస్థను సరిచేస్తున్న క్రమంలో సీనియర్ సిగ్నల్ మెయింటనర్, సిగ్నల్ అసిస్టెంట్‌ను కొందరు ఆకతాయిలు భయభ్రాంతులకు గురిచేశారు. దాడి చేసేందుకూ యత్నించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకోవటంతో ఆకతాయిలు పరారయ్యారు.

**రైల్వేట్రాక్‌లపై రాత్రిపూట విధులు నిర్వర్తించటం ఇబ్బందిగా మారింది.** గంజాయి, మద్యం మత్తులో ఆకతాయిలు మారణాయుధాలు, రాళ్లతో దాడులకు పాల్పడుతున్నారు. రైల్వే ఉద్యోగులకు భద్రత కల్పించాలి. కె.అంజయ్య, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుడు, ఖమ్మం

రైల్వే పరిసరాల్లో ఆకతాయిలు సంచరించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇటీవల రైల్వేట్రాక్‌పై విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగిపై ఒక యువకుడు దాడిచేశాడు. నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నాం. రైల్వే ట్రాక్‌లపై పకడ్బందీగా గస్తీ ఏర్పాటు చేస్తాం. అంతోటి వెంకటేశ్వరరావు, సీఐ, జీఆర్పీ, ఖమ్మం

# ప్రభుత్వ విద్యాలయాల్లో పరిశుభ్రతకు చోటేదీ?



కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పలు సంస్కరణలు చేపడుతున్నారు. వసతుల కల్పనపై బాగా దృష్టిసారించారు. కానీ పారిశుద్ధ్య చర్యల విషయంలో మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. ఓ వైపు వర్షాలు ప్రారంభమయ్యాయి. సీజనల్ వ్యాధుల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈ తరుణంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వ విద్యాలయాల్లోని స్కావెంజర్లు, కాపలాదారులను గతంలో తొలగించడం సమస్యాత్మకంగా మారింది. విద్యాలయాలకు సమకూర్చే విలువైన సామగ్రికీ రక్షణ కొరవడుతోంది. స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించాలని ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో తూతూమంత్రంగా అమలవుతున్నాయి. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 304 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కేవలం పాఠశాల ఆవరణను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లను విస్మరిస్తున్నారు.

**2015-16 విద్యా సంవత్సరంలో..**

పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు స్కావెంజర్లు, వాచ్‌మెన్లు, అటెండర్లను నియమించారు. ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చెల్లించేవారు. 2020 మార్చి తర్వాత వారందరినీ తొలగించారు. వీరు చేసే పనులను ప్రస్తుతం స్థానిక సంస్థల కార్మికులతో చేయించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ వారు పాఠశాలల ఆవరణలు, మైదానాలు అడపాదడపా శుభ్రం చేసి వెళ్తున్నారు. తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లను పట్టించుకోకపోవటంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. 'మన ఊరు - మన బడి' పథకానికి ఎంపికైన పాఠశాలల్లో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. కానీ మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రం చేసే వారే లేరు. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు స్థానిక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తేనే సిబ్బందిని పంపిస్తున్నారు. స్కావెంజర్ల నియామకమే సమస్యకు పరిష్కారంగా కనిపిస్తోంది.

**సమస్యను కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తా**

విద్యాలయాల్లోని పారిశుద్ధ్య పనులను స్థానిక పంచాయతీ కార్మికులతో నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని మరోసారి ఉభయ జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తా. విద్యాలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. విలువైన సామగ్రి ఉన్నచోట సీసీ కెమెరాల ఏర్పాటుపై నివేదిక పంపిస్తాం. సోమశేఖర్‌శర్మ, డీఈఓ

# నిధులు చాలక.. పనులు సాగక..!

ఖమ్మం: గోదావరి జలాలను బీడు భూములకు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు భూసేకరణకు నిధుల కొరత ఏర్పడింది. ఆరేళ్లుగా దశల వారీగా కొద్దికొద్దిగా నిధులు ఇస్తున్నా పూర్తిస్థాయిలో భూసేకరణ పూర్తి కానందున ప్రధాన కాల్వ తవ్వకంలో జాప్యం నెలకొంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టులో ప్రధానమైన పాలేరు లింకు కాల్వను ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తవ్వాల్సి ఉంది. ఈ ప్రధాన కాల్వ తవ్వకం పనులు నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. ఇప్పటి వరకు 13వ ప్యాకేజీ టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. 14వ ప్యాకేజీలో నిర్మాణ పనులే చేపట్టలేదు. 15, 16 ప్యాకేజీల్లో అక్కడక్కడా పనులు చేపడుతున్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లింపులు జరగనందున గుత్తేదారులు కాల్వ తవ్వకం పనులు నిలిపేశారు. అక్విడెక్టులు, సిమెంట్ కాంక్రీట్ పనులు మాత్రం కొనసాగిస్తున్నారు. 13వ ప్యాకేజీలో..ప్రైవేటు భూమి 34 ఎకరాలు సేకరించాలి. మిగతాది ప్రభుత్వ భూమి. 14, 15, 16 ప్యాకేజీల్లో 1,980 ఎకరాలు సేకరించి అవార్డు పాస్ చేయగా అందులో 832.48 ఎకరాలకు మాత్రమే రైతులకు డబ్బు చెల్లించారు. 14వ ప్యాకేజీలో డోర్నకల్ వద్ద రెండు రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద అక్విడెక్టుల నిర్మాణ పనులకు అవసరమైన భూమిని సేకరించి బాధిత రైతులకు డబ్బు చెల్లించారు. మిగతా రైతులు తాము కోల్పోయిన భూములకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. భూముల విలువ పెరుగుతున్నందున ఆందోళన చెందుతున్నారు. సేకరించిన వెంటనే రైతులకు పరిహారం చెల్లించి ఉంటే తమకు అనువైన ప్రాంతంలో కొనుగోలు చేసుకునేవారు. ప్రస్తుతం భూమి విలువ విపరీతంగా పెరగటంతో, తాము కోల్పోయిన భూమికి పాత ధర తక్కువగా నిర్ణయించారని అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీతారామ ప్రాజెక్టులో కీలకమైన 14వ ప్యాకేజీలో భూసేకరణకు నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు విడుదల కాగానే రైతులకు పరిహారం చెల్లిస్తాం. సుమారు రూ.150 కోట్లు విడుదల చేస్తే భూసేకరణ ప్రక్రియ పూర్తవుతుంది. పనులు వేగవంతం చేయవచ్చు. శంకర్‌నాయక్, సీఈ, ఖమ్మం, జలవనరుల శాఖ

# చిన్న రైతుకు సాగు బాసట

పెద్దపల్లి : చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. జాతీయ ఉపాధిహామీ పథకంలో భూముల అభివృద్ధి, సాగునీటి వసతి, చేపల చెరువుల పెంపకం, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణం వంటి వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. తాజాగా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు నిధులు కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల వరకు నిర్వహణ కోసం పూర్తి రాయితీపై రూ.2,50,272 అందిస్తారు. అరుదైన పంట కావడంతో సాగుపై అవగాహన కల్పించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సిద్ధమవుతోంది. ఇప్పుడిప్పుడే జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తరిస్తోంది. లాభాలు వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాయితీ అవకాశం ఉండటంతో విస్తీర్ణం పెరగనుందని భావిస్తున్నారు.

**ఔషధ గుణాలు**

డ్రాగన్ ఫ్రూట్ పండ్లు ఎరుపు, గులాబీ రంగుల్లో ఉంటాయి. ఒక్కసారి మొక్కలు నాటితే దాదాపు 40 ఏళ్ల పాటు దిగుబడి వస్తుందని అంచనా. నాటిన తర్వాత 18 నెలలకే పంట చేతికొస్తుంది. అనంతరం ఏడాదికొకసారి దిగుబడి వస్తుంది. ఒక్కో పండు బరువు 200 గ్రాముల బరువుతో విలక్షణమైన ఔషధ గుణాలు కలిగి ఉంటుంది. శరీరంలో రక్త కణాలు, పోషకాలు పెరుగుతుండటంతో వైద్యులు కూడా ఈ పండ్లు తినాలని సూచిస్తున్నారు. అన్ని రోగాలకు సంబంధించి ఔషధ గుణాలుండటంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పండులోని నల్లని గింజలను ఆయుర్వేద మందులుగా వాడుతున్నారు.

**అర్హులు ఎవరు..?**

ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. బోరు లేదా బావి నీటి వసతితో పాటు అయిదెకరాల లోపు భూమి ఉండాలి. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు గ్రామంలో ఎంత మంది రైతులు ముందుకొచ్చినా నిబంధనలకు అనుగుణంగా అందరికీ అనుమతినిస్తారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకంతో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సందేహాల నివృత్తికి అధికారులను సంప్రదించవచ్చు.

**అర ఎకరంలో 900 మొక్కలు**

డ్రాగన్‌ఫ్రూట్ సాగు కోసం మొక్కల కొనుగోలు నుంచి కూలీలు, సామగ్రి ఖర్చులకు నిధులు మంజూరు చేస్తున్నారు. అర ఎకరంలో సాగుకు మూడేళ్ల పాటు విడతల వారీగా రూ.2.50 లక్షలు విడుదలవుతాయి. మొక్క కొనుగోలు, రవాణా కోసం రూ.40 చొప్పున చెల్లిస్తారు. మూడు మీటర్ల పొడవు, మూడు మీటర్ల వెడల్పులో ఒక్కో మొక్క నాటాలి. అర ఎకరంలో 900 మొక్కలు నాటనున్నారు. స్తంభాలకు నలువైపులా నాలుగు మొక్కలు నాటాలి. కూలీలు, మొక్కలు, స్తంభాల కొనుగోలు, రవాణా తదితర ఖర్చులకు రాయితీ కల్పించారు. రాష్ట్రంలో ములుగు, సిద్దిపేటల్లో నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు.

**విడతల వారీగా నిధులు**

మొదటి ఏడాది: రూ.1,80,972

రెండు, మూడో సంవత్సరాల్లో: రూ.34,650 చొప్పున.. మొత్తం: రూ.2,50,272

**రైతులకు అవగాహన కల్పిస్తాం-శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి**

ఉపాధిహామీ పథకంలో కొత్తగా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రాయితీ అవకాశం ఉంది. సొంత భూమి, పట్టాదారు పాసుపుస్తకం, జాబ్‌కార్డు కలిగి ఉండటం తప్పనిసరి. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల సమన్వయంతో పథకాన్ని అమలు చేస్తాం. సాగు విస్తీర్ణం పెంపునకు రైతులకు అవగాహన కల్పిస్తాం. రైతులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తుదారుల అర్హతను బట్టి మంజూరు చేస్తాం.

# లెక్క తేలని మట్టి

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ఎర్ర మట్టి మాయమవుతోంది. కూడళ్ల సుందరీకరణ సమయంలో రూ.లక్షలు ఖర్చు చేసి పోయిస్తున్న మట్టి తిరిగి నిల్వ చేసుకోవాల్సి ఉండగా, అదేదీ పట్టకుండా ఉండటంతో కొందరు గుత్తేదారులు దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇందిరాచౌక్, తెలంగాణ చౌరస్తా కూడలి నుంచి సేకరించిన మట్టిని ట్రాక్టర్ల కొద్ది అమ్ముకోగా, ఫిర్యాదులు రావడంతో కొద్దిగా అంబేడ్కర్‌నగర్ రిజర్వాయర్ ప్రాంతంలో పోశారు. ఇంకొద్దిగా బైపాసు జంక్షన్‌లో పోశారు. ప్రస్తుతం అది కూడా ఏర్పడకుండా తరలించుకొని పోతుండటం వివాదాస్పదంగా మారుతోంది.

**అంతా గోల్‌మాల్..**

కూడళ్ల నిర్మాణంలో, కుదింపు సమయంలో అందుల్లోని మట్టి ఎక్కడికీ దేనికోసం తరలిస్తున్నారనే విషయం తెలియకుండా మారుతోంది. ఆ సమయంలో ఇంజినీరింగ్ అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎవరు కూడా అక్కడ ఉండరు. ఎన్ని ట్రిప్పులు తీసుకెళ్తున్నారో ఎవరికీ అర్థం కాకుండా ఉంటుంది. టెండర్ నిబంధనల ప్రకారం ఎర్త్ వర్క్ కార్టింగ్(రవాణా) ఛార్జీలు లెక్కిస్తారు. మట్టి తరలించేందుకు ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. నిర్మాణ వ్యర్థాలను అధికారులు గుర్తించిన ప్రదేశాల్లో పోయించుకో వచ్చు. అలా నగరంలో జరగడం లేదు. గుత్తేదారులే తీసుకెళ్లి అమ్ముకోవడం లేదంటే ఓ చోట నిల్వ చేసి తిరిగి ఇతర కూడళ్ల పనుల సమయంలో తీసుకొచ్చి పోస్తున్నారనే విమర్శలున్నాయి. అంబేడ్కర్‌నగర్ రిజర్వాయర్ వద్ద ఎర్రమట్టిని 9 నెలల కిందట నిల్వ చేశారు. సోమవారం జేసీబీ ద్వారా తవ్వుతూ.. ప్రభుత్వాసుపత్రిలో పచ్చదనం కోసం తీసుకెళ్లారు.

**నోటీసులకే పరిమితం**

తెలంగాణ జంక్షన్ అభివృద్ధి సమయంలో గుత్తేదారు నాణ్యమైన ఎర్రమట్టిని గ్రామీణ ప్రాంతాలకు, నగరంలో ట్రాక్టర్ల ట్రిప్పుల చొప్పున అమ్ముకున్నారు. కొందరు కార్పొరేటర్లు డివిజన్లలో మొక్కల కోసం మట్టి కావాలన్నా పోయలేదు. ఆ విషయాన్ని అప్పట్లో బహిర్గతం చేశారు. రూ.3 వేల చొప్పున ట్రాక్టర్ పోయగా సుమారు వంద ట్రిప్పుల వరకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. వెంటనే నిలిపివేసి అంబేడ్కర్‌నగర్ ట్యాంకులో, ఇతర రిజర్వాయర్లలో పోయించారు. స్మార్ట్‌సిటీ ద్వారా సదరు గుత్తేదారుకు నోటీసు జారీ చేశారు. ఆ సమయంలో రికవరీ చేస్తామని చెప్పిన ఇంజినీరింగ్ అధికారులు, ఎంతమేర చేశారనే విషయాన్ని మాత్రం ఇప్పటికీ లెక్క తేల్చకపోగా, ఆ అంశాన్ని గోప్యంగా ఉంచారు.

**బిల్లు రికార్డు చేయలేదు- మసూద్‌అలీ, డీఈఈ, నగరపాలిక**

అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లు రికార్డు చేయలేదు. ఆ సమయంలో మట్టి విలువ ఎంతమేర తేలితే అంతమేరకు తొలగించుకొని బిల్లు రికార్డు చేస్తాం. ప్రభుత్వ యూనాని ఆసుపత్రిలో మొక్కల కోసమంటే ఒకటెండ్రు ట్రాక్టర్లు అంబేడ్కర్‌నగర్ ట్యాంకు వద్ద నుంచి తీసుకెళ్లారు.

# రాజ్యసభ అభ్యర్థులను మార్చిన జగన్.. తెరపైకి కొత్త వ్యక్తి..!



అమరావతి: రాజ్యసభ అభ్యర్థులను వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి మార్చివేశారు. గతంలో లీక్‌లు ఇచ్చిన ముగ్గురిలో ఒక అభ్యర్థిని మార్చేశారు. ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు స్థానంలో కడపకు చెందిన మేడా రఘునాథరెడ్డి పేరు జగన్ పరిశీలిస్తున్నట్టు సమాచారం. మొత్తం మూడు సీట్లలో పోటీ చేయాలని వైసీపీ నిర్ణయం తీసుకుంది. సాయంత్రం ముగ్గురి పేర్లు ప్రకటిస్తారని సమాచారం. వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు, మేడ రఘునాథరెడ్డి పేర్లు ఖరారు అవుతాయని సమాచారం.

ఈ నెల 8న అసెంబ్లీ సమావేశాలు చివరి రోజు కావడంతో ఎమ్మెల్యేలతో మాక్ పోలింగ్ నిర్వహించాలని వైసీపీ నిర్ణయం తీసుకుంది.

**ఏం జరుగునో..?** రాజ్యసభ ఎన్నికలు రాష్ట్రంలో వేడి పుట్టిస్తున్నాయి. సాధారణంగా ఏకగ్రీవంగా జరిగే ఈ ఎన్నికల్లో ఈసారి పోటీ తప్పదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. వైసీపీలో అంతర్గత సంక్షోభాన్ని ఆసరా చేసుకుని ఒక సీటు కైవసం చేసుకోడానికి టీడీపీ పావులు కదుపుతోంది.

తమ ఎమ్మెల్యేలు చేజారకుండా చూసుకోడానికి అధికారపక్షం తిప్పలు పడుతోంది. ఈసారి రాష్ట్రం నుంచి ముగ్గురు రాజ్యసభ ఎంపీలు రిటైర్ అయ్యారు. వారి స్థానాలకు ఎన్నికల నిర్వహణకు కొద్ది రోజుల క్రితం షెడ్యూల్ వెలువడింది.

# ఎంతకి బరితెగించారు?.. కానిస్టేబుల్ గణేష్ మృతిపై లోకేష్ ఆగ్రహం



అమరావతి, ఫిబ్రవరి 6: అన్నమయ్య జిల్లాలో ఎర్ర చందనం మాఫియా చేతిలో కానిస్టేబుల్ గణేష్ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై టీడీపీ జాతీయ ప్రధాన నారా లోకేష్ స్పందించారు. జగన్ పాలన ఎర్రచందనం స్మగ్లర్ల పాలిట స్వర్ణయుగమైందని యువనేత విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. పుంగనూరు వీరప్పన్ పెద్దిరెడ్డి, అంతర్జాతీయ స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి ప్లానింగ్‌తో వైసీపీ పార్టీ రెడ్ శాండిల్ మాఫియా అవతారం ఎత్తిందని వ్యాఖ్యలు చేశారు. ఎర్రచందనం స్మగ్లర్లను పార్టీ అభ్యర్థులుగా ప్రకటించిన జగన్ రెడ్ శాండిల్ స్మగ్లింగ్‌కు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారన్నారు. అడ్డొచ్చిన పోలీసులను వైసీపీ రెడ్ శాండిల్ మాఫియా చంపేస్తుందన్నారు. అన్నమయ్య జిల్లా కె.వి.పల్లి మండలంలో కూంబింగ్ నిర్వహిస్తున్న టాస్క్ ఫోర్స్ పోలీసులపై మెరుపుదాడులకు పాల్పడి కానిస్టేబుల్ గణేష్‌ను చంపేయటం రాష్ట్రంలో వైసీపీ రెడ్‌శాండిల్ మాఫియా దారుణాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. టాస్క్ ఫోర్స్ పోలీసు వాహనాలనే ఢీకొట్టి కానిస్టేబుల్‌ని చంపేశారంటే.. సర్కారీ పెద్దల అండదండలతో ఎంతగా బరితెగించారో అర్థం చేసుకోవచ్చన్నారు. విధినిర్వహణలో పాలకుల మాఫియాకి బలైన కానిస్టేబుల్ గణేష్‌కు యువనేత నివాళులర్పించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గణేష్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. గణేష్‌ను అత్యంత కిరాతకంగా చంపేసిన రెడ్ శాండిల్ మాఫియాని కఠినంగా శిక్షించాలని లోకేష్ డిమాండ్ చేశారు.

# మరోసారి షర్మిల జిల్లాల పర్యటన.. షెడ్యూల్ ఇదే...



అమరావతి, ఫిబ్రవరి 6: ఏపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాక వైఎస్ షర్మిల రెడ్డి దూసుకెళ్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చే బాధ్యతను తీసుకున్న షర్మిల ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పునర్వైభవం తీసుకువచ్చేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా వైఎస్సార్సీపీ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. అలాగే క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఒకసారి తొమ్మిది రోజుల పాటు జిల్లాల్లో షర్మిల పర్యటించి అందరిని కలుపుకుపోతూ.. కీలన నేతలను పార్టీలోకి తీసుకువచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేశారు. తాజాగా మరోసారి షర్మిల జిల్లాల పర్యటనకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈనెల 7 నుంచి 11 వరకు షర్మిల జిల్లాల పర్యటన సాగనుంది. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. పలు నియోజకవర్గాల్లో రచ్చబండ కార్యక్రమాలు, బహిరంగ సభలో ఏపీసీసీ చీఫ్ పాల్గొననున్నారు.

**షర్మిల పర్యటన షెడ్యూల్ ఇదే..** ఈ నెల 7న సాయంత్రం బాపట్ల నియోజకవర్గంలో బహిరంగ సభ. ఈ నెల 8న ఉదయం 10 గంటలకు తెనాలిలో రచ్చబండ. 8న సాయంత్రం 5 గంటలకు ఉ ంగుటూరు నియోజకవర్గంలో బహిరంగ సభ.

ఈ నెల 9న ఉదయం 10 గంటలకు కొవ్వూరు నియోజకవర్గంలో రచ్చబండ. 9న సాయంత్రం 5 గంటలకు తుని నియోజకవర్గంలో బహిరంగ సభ. ఈ నెల 10న ఉదయం నర్సీపట్నం నియోజకవర్గంలో రచ్చబండ. 10న సాయంత్రం 5 గంటలకు పాడేరు నియోజకవర్గంలో బహిరంగ సభ. ఈ నెల 11 న సాయంత్రం 5 గంటలకు నగరి నియోజకవర్గం బహిరంగ సభ.

**జ్వరం కారణంగా వాయిదా** కాగా.. ఈనెల 5 నుంచే షర్మిల జిల్లాల్లో పర్యటించాల్సి ఉంది. అయితే అనారోగ్యం కారణంగా షర్మిల జిల్లాల పర్యటన రెండు రోజుల పాటు వాయిదా పడింది. ఇటీవల ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలంటూ ఢిల్లీలోని ఏపీభవన్‌లో షర్మిల ఆధ్వర్యంలో దీక్ష జరిగిన విషయం తెలిసిందే. ఆ తరువాత షర్మిల అనారోగ్యం బారిన పడినట్లు తెలుస్తోంది. దీంతో ఈనెల 5 జరగాల్సిన జిల్లాల పర్యటన రెండు రోజులు ఆలస్యంగా ఈనెల 7 నుంచి మొదలుకానుందని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు.

# అవనిగడ్డలో రోడ్డెక్కిన డీఎస్సీ అభ్యర్థులు.. తెదేపా, జనసేన మద్దతు




అవనిగడ్డ: నిరుద్యోగ యువతకు తెలుగుదేశం, జనసేన పార్టీలు అండగా ఉంటాయని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. దగాపడ్డ బీఈడీ, డైట్ విద్యార్థులకు మద్దతుగా అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన రిలేదీక్షలో ఆయన పాల్గొని మద్దతు ప్రకటించారు. లక్షలాది నిరుద్యోగులు ఐదేళ్లుగా డీఎస్సీ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. "అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్ హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఐదేళ్లయినా ఒక్కసారి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదు. నాడు-నేడు పథకం ద్వారా ప్రజాధనం దోచుకుని, ఆ తర్వాత 117 జీవో తీసుకొచ్చి ఉన్న పాఠశాలలను మూసివేయించారు. పాఠశాలలు లేకపోతే ఉపాధ్యాయ నియామకాలు ఎలా చేపడతారు?" అని ప్రశ్నించారు.

**ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..** దీక్ష అనంతరం డీఎస్సీ అభ్యర్థులు వంతెన సెంటర్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. మినీ వద్దు.. మెగా డీఎస్సీ కావాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనలో వందలాది మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. రిలే దీక్ష నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచే అవనిగడ్డలో పోలీసులు భారీగా మోహరించారు. ర్యాలీ నిర్వహించకుండా ఆందోళనకారులను అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

# దుగ్గిరాలలో 'నిజం గెలవాలి' యాత్ర.. భువనేశ్వరికి ఘనస్వాగతం



దుగ్గిరాల: 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా గుంటూరు జిల్లా దుగ్గిరాలలో నారా భువనేశ్వరి పర్యటించారు. తెదేపా అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఆ పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. దుగ్గిరాలకు వచ్చిన భువనేశ్వరికి మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. కన్నెగంటి మోహన్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం శౌరి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.




తెదేపా అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను చంద్రబాబు పునరుద్ధరిస్తారని ఆయన సతీమణి నారాభువనేశ్వరి చెప్పారు. అన్న క్యాంటీన్లను వైకాపా ప్రభుత్వం నిలిపివేసినా రాష్ట్ర వ్యాప్తంగా 140కి పైగా క్యాంటీన్లను తెదేపా శ్రేణులు స్వచ్ఛందంగా నడుపుతున్నారని తెలిపారు. మంగళగిరిలో నాలుగో క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా భోజనం వడ్డించారు.

# మార్చి నుంచి వందేభారత్ స్లీపర్.. తొలి రైలు ఈ రూట్‌లోనే!



దిల్లీ: వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ రైళ్ల ట్రయల్ రన్ మార్చి నెల నుంచి చేపట్టనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఏప్రిల్‌లో ఈ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని, తొలి రైలును దిల్లీ-ముంబయిల మధ్య ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రాజధాని ఎక్స్‌ప్రెస్ కంటే వేగంగా ప్రయాణించే ఈ రైలులో 16 నుంచి 20 (ఏసీ, నాన్-ఏసీ) కోచ్‌లు ఉంటాయి. వీటితో దేశంలోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని రైల్వే అధికారులు తెలిపారు. "రాత్రి వేళలో ఎక్కువ ప్రయాణదూరం ఉండే రూట్లలో వందేభారత్ స్లీపర్ రైళ్లను నడపాలని నిర్ణయించాం. వీటిని చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో డిజైన్ చేశారు. ఇప్పటి వరకు భారతీయ రైల్వేలో ఉన్న సర్వీస్‌ల కంటే ఇవి వేగంగా ప్రయాణిస్తాయి. దీంతో ప్రయాణ సమయం రెండు గంటలు ఆదా అవుతుంది. తొలి దశలో పది రూట్లలో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని భారతీయ రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

**కొత్త కారిడార్లు.. సరికొత్త బోగీలు :** ఇప్పటికే సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఛైర్‌కార్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య సర్వీస్‌లను అందిస్తున్నాయి. త్వరలో వందే మెట్రో రైలును కూడా తీసుకురానున్నట్లు సమాచారం. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో భాగంగా దాదాపు 40 వేల సాధారణ కోచ్‌లను అధునాతన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ తరహా కోచ్‌లుగా మారుస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. దీంతో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

# 'పరీక్షల్లో అక్రమాల కట్టడి' బిల్లుకు.. లోక్‌సభ ఆమోదం



దిల్లీ: కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పరీక్షల్లో జరిగే అక్రమాలను అడ్డుకునేందుకు వీలుగా రూపొందించిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు-2024'కు మంగళవారం లోక్‌సభలో ఆమోదం లభించింది.

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీన్ని సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ప్రతిభావంతులైన విద్యార్థులు, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్దేశించిన బిల్లుగా దీన్ని పేర్కొన్నారు.

**కేజీకి పాల్పడితే భారీ శిక్ష :** ఈ బిల్లుకు సంబంధించి విపక్ష సభ్యులు ప్రతిపాదించిన కొన్ని సవరణలు తిరస్కరణకు గురయ్యాయి. అనంతరం లోక్‌సభ దీన్ని ఆమోదించింది.

ఇది అమల్లోకి వస్తే పేపరు లీకేజీకి పాల్పడినా, మాల్ ప్రాక్టీస్ చేసినా, నకిలీ వెబ్‌సైట్లను సృష్టించినా.. గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకూ జరిమానా పడనుంది. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, ఎన్‌డీఏ వంటి పోటీ పరీక్షలతోపాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి ప్రవేశపరీక్షలకూ వర్తిస్తుంది.

# టికెట్లు అడిగిన జనసేన నేతలపై పవన్ సీరియస్.. ఇదీ అసలు కథ!



అమరావతి: జనసేన పేరిట చెక్‌లు ఇచ్చి, ఆ తర్వాత సీటు అడుగుతున్న నేతలపై ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సీరియస్ అయ్యారు. ఇటీవల పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు జనసేన తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. వారిలో కొందరు.. పార్టీకి డొనేషన్ ఇస్తున్నామని చెక్‌లు ఇచ్చారు. దీన్నే సాకుగా చూపిస్తూ తాము ఫలానా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తామని సీట్లు అడిగారు. దీంతో సీట్లు అడిగిన ప్రముఖులపై పవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పార్టీ ముఖ్యనేతలు, సిబ్బందితో పవన్ మాట్లాడి.. సీట్లు అడిగిన ప్రముఖుల చెక్‌లను వెంటనే వెనక్కి పంపాలని ఆదేశించారు.

**ఎందుకివ్వాలి..?** పవన్ ఆదేశాలతో ముఖ్యనేతలు రంగంలోకి దిగి.. చెక్‌లు ఇచ్చిన ప్రముఖులకు ఫోన్‌లు చేసి వెనక్కి తీసుకెళ్లాలని ఫోన్లు చేస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే ఏడుగురికి చెక్‌లను పవన్ వెనక్కి పంపించినట్లు సమాచారం. ఆయన నిర్ణయంతో సీట్లు ఆశించి చెక్‌లు ఇచ్చిన ప్రముఖులు కూడా ఖంగు తిన్నట్లు తెలుస్తోంది. ఇన్నేళ్లు పార్టీ కోసం కష్టపడి పని చేసిన నేతలను వదిలి కొత్తవారికి ఎలా అవకాశం ఇస్తారని పవన్ చెక్‌లు ఇచ్చిన వారిని ప్రశ్నించినట్లు సమాచారం.

# ప్రత్యేక హోదా ఎండమావేనని తేల్చిన జగన్

అమరావతి: ప్రత్యేక హోదా ఎండమావేనని ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి తేల్చేశారు. నేడు ఏపీ అసెంబ్లీలో జగన్ మాట్లాడుతూ.. సంప్రదాయానికి గౌరవం ఇస్తూ తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. మూడు నెలల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడతామన్నారు. తాము అధికారంలోకి రాగానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర నైరాశ్యంలో ఉందని జగన్ తెలిపారు. ఎకనామిక్ పవర్ హౌస్ రాష్ట్రానికి ఉండాలన్నారు. హైదరాబాద్ లాంటి నగరాలు లేకపోతే రాష్ట్రానికి చెందిన ఆదాయాలు ఎప్పటికీ పెరగవని జగన్ అన్నారు. ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను వదులుకుని వచ్చేశామన్నారు. తద్వారా ప్రతీ ఏటా 13 వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నామని జగన్ తెలిపారు.ఏపీది రైతులతో కూడిన ఎకానమి అని పేర్కొన్నారు. ఏపీకి హైదరాబాద్ లాంటి నగరం లేకపోవటం దారుణమని జగన్ పేర్కొన్నారు. మన ఖర్మ కొద్దీ ప్రత్యేక హోదా అనేది ఎండమావిలా కనిపిస్తోందన్నారు. ఇంకా జగన్ మాట్లాడుతూ.. "వైసీపీ మద్దతుతో కేంద్ర ప్రభుత్వం ఏర్పడితే ప్రత్యేక హోదా వచ్చేది. రాష్ట్రం విడగొట్టడమే అన్యాయం అయితే హోదా ఇవ్వకపోవడం ఇంకా అన్యాయం. 57 నెలల పాటు వైసీపీ పాలనలో అవినీతి లేకుండా.. వ్యవస్థలను ప్రక్షాళన చేశాం. 2019కి ముందు ప్రభుత్వం చేసే ప్రతీ పైసా ఖర్చు ప్రజల చేతుల్లోకి చేరటం అనుమానమే. ఇప్పుడు బటన్ నొక్కడం ద్వారా నేరుగా ప్రజల ఖాతాలకే వెళ్తోంది. నాన్ డీబీటీ కింద రూ.1.07 లక్షల కోట్లు ప్రజలకు చేరింది. మూలధన వ్యయం తక్కువ అని ఆరోపణలు చేశారు.

ఇది పూర్తిగా అసత్యం. కాగ్ రిపోర్టుల ప్రకారం సగటున 17 వేల కోట్ల రూపాయల వ్యయం చేశాం. అప్పులు ఇబ్బడి ముబ్బడిగా చేశామని ఆరోపణలు చేస్తున్నారు. ప్రస్తుతం 7.03 లక్షల కోట్ల రూపాయల అప్పు రాష్ట్రంపై ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో బటన్‌లు లేవు, పథకాలు లేవు ఉన్నదంతా దోచుకోవటం పంచుకోవడమే" అని జగన్ పేర్కొన్నారు.

# ఓ మహిళ ఇంట్లో తెలంగాణ మద్యం పట్టివేత



నంద్యాల, ఫిబ్రవరి 6: శ్రీశైలంలో భారీగా తెలంగాణ మద్యం పట్టుబడింది. క్షేత్రంలోని టోల్‌గేట్ సమీపంలో ఓ మహిళ గృహంలో 166 క్వాటర్ బాటిళ్ల తెలంగాణ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు మహిళ ఇంట్లో శ్రీశైలం సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహిళ ఇంట్లో భారీగా మద్యం పట్టుబడింది. తెలంగాణ రాష్ట్రం మున్ననూర్ నుంచి అక్రమ మద్యం తెచ్చిన మహిళపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీశైలం క్షేత్రపరిధిలో నిబంధనలను అతిక్రమించి మద్యం, మాంసం తెస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ ప్రసాదరావు హెచ్చరించారు.

# ఈగల్ అనుపమ.. కొంచం ఇష్టంగా.. కొంచం కష్టంగా..!

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్ లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన సినిమా ఈగల్. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, కావ్య థాపర్ హీరోయిన్స్ గా నటించారు. సినిమాతో దేవ్ జాండ్ ని మ్యూజిక్ డైరెక్టర్ గా పరిచయం చేస్తున్నారు. సినిమా ఫిబ్రవరి 9న రిలీజ్ అవుతుండంగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చిత్ర యూనిట్ సమక్షంలో జరిగింది. ఈ ఈవెంట్ లో భాగంగా హీరోయిన్ అనుపమ స్పీచ్ ఆకట్టుకుంది. స్టేజ్ మీదకు అనుపమ రాగానే ఆమెకు కార్తీక్ ని తను అన్నయ్య అన్న వీడియో చూపించారు.



కార్తీక్ తో ఉన్న రిలేషన్ ఏంటని.. ఒక ఫ్రెండ్ షిప్ బ్యాండ్ ఇచ్చారు యాంకర్ సుమ. కార్తీక్ ని స్టేజ్ మీదకు పిలిపించి అతనికి కట్టించారు. కార్తీక్ తో నలుగు సినిమాలు వర్క్ చేశా కాబట్టి అన్నయ్య అని పిలుస్తున్నానని అన్నారు అనుపమ. తను చాలా తక్కువ మందిని అన్నయ్య అంటానని కార్తీక్ అలా కనెక్ట్ అయ్యారని అన్నారు. ఇక ఈగల్ సినిమాలో చేయడం చాలా లక్కీ అని అన్నారు అనుపమ. ముందుగా ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతలకు థాంక్స్ చెప్పారు అనుపమ. ఇది వాళ్లతో సెకండ్ సినిమా అని అన్నారు. కార్తీక్ అన్నయ్యతో ఇది నాలుగో సినిమా.. అతన్ని కార్తీక్ అని పిలవడానికి ట్రై చేశా కుదరట్లేదు. ఆ వీడియో వైరల్ అయ్యింది. అన్నయ్య ఇంత మంచి క్యారెక్టర్ ఇచ్చినందుకు థాంక్స్ అని అన్నారు అనుపమ. మామూలుగా ఏ సినిమాలో అయినా అందరు యాక్టర్స్ తో కాంబినేషన్ సీన్ ఉండదు. కానీ తన అదృష్టం ఏంటంటే ఈ సినిమాలో అందరితో సీన్స్ ఉన్నాయి. అలాంటి ఒక స్ట్రాంగ్ క్యారెక్టర్ స్ట్రాంగ్ మోటివ్ ఇచ్చినందుకు థాంక్స్ అన్నారు. ఈ సినిమాలో కన్నా భారీ డైలాగ్స్ రాసి నన్ను టార్చర్ చేయాలని డైలాగ్ రైటర్ మణి గురించి అన్నారు అనుపమ. సినిమాలో నటించిన క్రూ అందరికీ థాంక్స్ చెప్పిన అనుపమ రవితేజ గారితో పనిచేయడం కొంత హ్యాపీగా ఉన్నా కొంత సాడ్ గా కూడా ఉంది. అది ఎందుకన్నది ఆయనకు తెలుసని అన్నారు. సినిమాకు పనిచేసిన వారంతా కూడా బెస్ట్ ఎఫర్ట్స్ పెట్టారు. వాళ్లందరికీ ఈ సినిమా సక్సెస్ అందించాలని అన్నారు అనుపమ.

## పెళ్లికి ముందు రకుల్ చేసిన ఈ పని చూశారా?

అందాల రకుల్ ప్రీత్ సింగ్ – జాకీ భగ్నాని జంట ఫిబ్రవరి 21న గోవాలో రెండు రోజుల డెస్టినేషన్ పెళ్లి వేడుకలో ఒకటి కానున్నారు. వాస్తవానికి విదేశాలలో డెస్టినేషన్ వెడ్డింగ్‌ని ప్లాన్ చేసిన ఈ జంట, భారతదేశంలోనే పెళ్లాడాలని చివరి నిమిషంలో ప్లాన్ ని మార్చుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'స్వదేశీ పిలుపు'తో చివరి నిమిషంలో కొత్త నిర్ణయం తీసుకున్నారు. రకుల్ – జాకీ కొన్ని సంవత్సరాలుగా డేటింగ్ చేస్తున్నారు. ఎట్టకేలకు పెళ్లితో ఒకటవుతున్నారు. ఊహాగానాలకు విరుద్ధంగా రకుల్– జాకీ వారి కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో గోవాలో మాత్రమే వివాహాన్ని జరుపుకుంటారని కథనాలొస్తున్నాయి. అంతేకాదు.. ముంబైలో లేదా మరెక్కడా వేడుకలు లేదా రిసెప్షన్‌లు ఉండవు. సాధారణంగా చాలా వివాహాల మాదిరిగానే



ఇది 3-4 రోజుల వ్యవహారంగా సాగనుందని తెలిసింది. నిజానికి రకుల్ – జాకీ మొదట తమ వివాహాన్ని మిడిల్ ఈస్ట్‌లో ప్లాన్ చేసారు. దాదాపు ఆరు నెలల పాటు ప్లానింగ్ బాగానే సాగినా.. డిసెంబర్‌లో మాల్దీవులతో ఇష్యూస్ అనంతరం భారత ప్రధాని పిలుపు మేరకు, ధనిక ప్రభావవంతమైన కుటుంబాలు తమ జీవితంలో పెద్ద వేడుకలకు భారతదేశాన్ని వేదికగా ఎంచుకోవాలని కోరడంతో రకుల్ –జాకీ తమ వాస్తవ ప్రణాళికలను పునఃపరిశీలించి, వివాహ వెన్యూని భారతదేశానికి మార్చారు. డిసెంబరు మధ్యలో వారి నిర్ణయం మారింది. దేశంపై ప్రేమతో వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు తోడ్పడాలనే కోరికతో ఈ జంట భారతదేశ సమగ్రతకు సహకారంగా నిర్ణయం మార్చుకున్నారు. రకుల్ ప్రీత్ పెళ్లికి సిద్ధమవుతున్న వేళ లేటెస్ట్ గా తన ఫోటోషూట్లు అభిమానుల్లో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా రకుల్ బ్లాక్ అండ్ బ్లాక్ లుక్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. మాజీ మిస్సు, స్టార్ హీరోయిన్ రకుల్ 33 ఏజ్ లోను ఎంతో బ్యూటిఫుల్ గా టీనేజీ లుక్ తో కనిపిస్తోంది. ఇటీవల పూర్తిగా స్లిమ్ లుక్ లోకి మారిన రకుల్ థై స్లిట్ బ్లాక్ డిజైనర్ గౌన్ లో ఏంజెల్ ని తలపిస్తోంది. ఈ ఫోటోషూట్ కి బ్లాక్ ఈజ్ మిస్టరీ అంటూ అందమైన క్యాప్షన్ ని కూడా ఇచ్చింది. 'నలుపు అనేది మిస్టరీ' అని బ్లాక్ లవ్ ఈమోజీని షేర్ చేసింది. ఈ బ్లాక్ మిస్టరీ గౌన్ కి తగ్గట్టుగానే తన అందమైన మెడలో వైట్ కలర్ డిజైనర్ నెక్లెస్ ని ధరించింది. రకుల్ కొత్త లుక్ పై తన స్నేహితురాలు ప్రగ్య జైశ్వాల్ ప్రశంసలు కురిపించింది. అభిమానులు లవ్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు.





# 31 లోనూ 21 ఏళ్ల బ్యూటీలాగే పాయల్ మెరుపులు!




'ఆర్ ఎక్స్ 100' విజయంతో మెరుపులా దూసుకొచ్చిన పాయల్ రాజ్ పుత్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు తొలి సినిమాతోనే కుర్రాళ్ల మనసులు దొచింది. కానీ అటుపై నటించిన సినిమాలేవి పాయల్ ని స్టార్ గా నిలబెట్టలేకపోయాయి. చేసిన ప్రయత్నాల్లి విఫలమయ్యాయి. చివరికి పక్క భాషల్లో సైతం అదృష్టాన్ని పరీక్షించుకుంది. అక్కడా అదే పరిస్థితి. ఒకటి రెండు సినిమాలతోనే నిష్క్రమించాల్సిన పరిస్థితి. దీంతో లాభం లేదనుకున్న అమ్మడు మళ్లీ హైదబాద్ కి కంబ్యాక్ అయింది. ఇక్కడ నుంచే పనులన్నీ మొదలు పెట్టింది. ఈ క్రమంలోనే అవకాశాలు ఉంటే తనకివ్వమని అడిగింది. 'మంగళవారం' చిత్రంలో కూడా అజయ్ భూపతి అలాగే అవకాశం కల్పించాడు. అతడే హీరోయిన్ గా పరిచయం చేయడంతో అదే చనువుతో అడగం..ఆయన కాదనలేకపోవడం..ఆ సినిమా మంచి విజయం సాధించడం అన్నీ జరిగిపో యాయి. కానీ పాయల్ మాత్రం బిజీ అవ్వలేదు. చాలా గ్యాప్ తర్వాత 'మంగళవారం'తో విజయం దక్కినా అవకాశాల పరంగా వెనుకబడే ఉంది. మంగళవారం సినిమా లో కాస్త హద్దు దాటి నటించినా! నటిగా మార్కులు వేయించుకుంది తప్ప...కొత్త ఛాన్సులకు మాత్రం ఆ సినిమా మార్గాన్ని చూపలేదు. అయినా పాయల్ ప్రయత్నాలు మాత్రం ఆగలేదు. నిరంతరం ఛాన్సులు అడుగుతూనే ఉంది. ఇటీవలే 'కాంతార-2' లో కూడా ఛాన్స్ ఇవ్వండని అడిగిన సంగతి తెలిసిందే. ఆ విషయం పక్కనబెడితే తాజాగా పాయల్ తొలిసారి కెరీర్ లో మొదటి కెమెరా ముందుకొచ్చి ఫోజులిచ్చిన ఫోటో షూట్ ని అభిమానులతో పంచుకుంది. ఆ పాత సంగతులు గుర్తు చేసుకుని మురిసిపోయింది. 21 ఏళ్లకే మోడలింగ్ లోకి వచ్చిందిట. ఇదే నా తొలి ఫోటో షూట్ అంటూ సిగ్గుపడిపోయింది. ఓ మ్యాగజైన్ కోసం పాయల్ ఈ షూట్లో పాల్గొన్నట్లు తెలిపింది. ఆరేంజ్ అండ్ క్రీమ్ కలర్ కాంబినేషన్ డిజైన్ దుస్తుల్లో కనిపిస్తుంది. అయితే పాయల్ అందం విషయంలో పెద్ద మార్పులేమి కనిపించలేదు. అప్పుడెలా ఉందో? ఇప్పటికీ అలాగే ఉంది. ఫిట్ నెస్ విషయంలో ఎంతో కేరింగ్ తీసుకుంటుందని తెలుస్తోంది. 31 ఏళ్ల వయసులోనూ 21 ఏళ్ల అమ్మాయిలాగే కనిపిస్తోంది.

# టాప్ వ్యూ లో శ్రీముఖి గ్లామర్ కిక్.. స్టన్నింగ్!





రీసెంట్ గా అమ్మడు ఒకవైపు ట్రెడిషనల్ టచ్ ఇస్తూనే మరొకవైపు తనలోని గ్లామర్ ను హైలైట్ చేసింది. బ్లాక్ కలర్ఫుల్ డ్రెస్సులలో అమ్మడు టాప్ వ్యూలో తన అందాలను మరింత అందంగా ప్రజెంట్ చేసింది. టెలివిజన్ రంగంలో యాంకర్ గా మంచి గుర్తింపు అందుకున్న వారిలో శ్రీముఖి కూడా టాప్ లిస్టులో ఉంటుంది అని చెప్పవచ్చు. చాలా రకాల రియాల్టీ షోలలో అమ్మడు మంచి యాంకర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకుంది. ఇక ఆ తర్వాత మెల్లగా వెండితెరపై కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. మొదట జులాయి సినిమాతో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మొదలైన ఆమె ప్రయాణం ఆ తర్వాత కొన్ని సినిమాలలో ప్రధాన పాత్రలు పోషించే స్థాయికి వచ్చింది. శ్రీముఖి ఎలాంటి పాత్ర చేసిన కూడా డిఫరెంట్ గా యాక్ట్ చేస్తుంది అని మంచి క్రేజ్ అయితే అందుకుంది. అయితే రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్ లో కాకుండా పాత్రలో ఎంతో కొంత కొత్తదనం ఉంటే గానీ ఈ భామ గ్రీన్ సిగ్నల్ అయితే ఇవ్వడం లేదు. ఇక ఎక్కువ కాలం అయితే టెలివిజన్ ప్రపంచం లోనే తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. అక్కడే ఆమెకు మంచి రెమ్యునేషన్స్ కూడా వచ్చాయి. ఇక అప్పుడప్పుడు సోషల్ మీడియాలో శ్రీముఖి పోస్ట్ చేసే ఫోటోలు ఏ రేంజ్ లో క్లిక్ అవుతాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక రీసెంట్ గా అమ్మడు ఒకవైపు ట్రెడిషనల్ టచ్ ఇస్తూనే మరొకవైపు తనలోని గ్లామర్ ను హైలైట్ చేసింది. బ్లాక్ కలర్ఫుల్ డ్రెస్సులలో అమ్మడు టాప్ వ్యూలో తన అందాలను మరింత అందంగా ప్రజెంట్ చేసింది. ఇక ఫోటోను చూసిన ఫాలోవర్స్ చాలా పాజిటివ్ రియాక్ట్ అవుతున్నారు. శ్రీముఖి మంచి గ్లామర్స్ రోల్స్ చేస్తే మాత్రం ఆమె కెరీర్ మరో స్థాయికి చేరుకుంటుంది అనేలా కూడా పలువురు ప్రశంసిస్తున్నారు. శ్రీముఖి ఎక్కువగా అయితే బిగ్ బాస్ షో ద్వారా మంచి క్రేజ్ అందుకుంది. ఇక తర్వాత ఆమెకు కొన్ని హీరోయిన్స్ గా కూడా అవకాశాలు వచ్చాయి. కానీ అందులో కొన్ని మధ్యలోనే ఆగిపోయాయి. ఇక మరికొన్ని రిలీజ్ అయినప్పటికీ కూడా పెద్దగా సక్సెస్ కాలేదు. ఇక ప్రస్తుతం శ్రీముఖి వీలైనంతవరకు యూట్యూబ్ అలాగే సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ లలో తన క్రేజ్ పెంచుకునే ప్రయత్నం చేస్తుంది. అలాగే అప్పుడప్పుడు పలు రియాలిటీ షోలతో కూడా సందడి చేస్తోంది. మరి ఈ గ్లామర్ తో అమ్మడు రాబోయే రోజుల్లో బిగ్ స్క్రీన్ పై ఏవైనా మంచి అవకాశాలు అందుకుంటుందో లేదో చూడాలి.

# 14 ఏళ్ల వయసులోనే భూమీపడ్నేకర్ పై వేధింపులు!

బాలీవుడ్ హాట్ బ్యూటీ భూమీ పడ్నేకర్ వరుస విజాయాలతో దూసుకుపోతున్న సంగత తెలిసిందే. గత ఏడాది అమ్మడు ఏకంగా నాలుగు రిలీజ్ లతో మంచి ఫలితాలే సాధించింది. 'భీద్' ..' అఫ్వా' ..' థాంక్యూ ఫర్ కమింగ్' ..'ది లేడీ కిల్లర్' లాంటి విజయాలతో మెప్పించింది. తాజాగా అమ్మడు క్రైమ్ థ్రిల్లర్ 'భక్షక్' తోనూ అలరించడానికి రెడీ అవుతోంది. ఇందులో అమ్మడు లైంగిక వేధింపుల నుండి బాలికలను రక్షించే జర్నలిస్ట్ పాత్ర పోషించింది. ఈ సినిమా రిలీజ్ సందర్భంగా అమ్మడు తనకెదురైన లైంగిక వేధింపుల గురించి రివీల్ చేసింది. 14 ఏళ్ల వయసులో ఓ ఆపరిచిత వ్యక్తి తనపై అనుచితంగా ప్రవర్తించిన తీరును గుర్తు చేసుకుంది. ఆ గాయం నుంచి ఇప్పటికీ బయటపడలేదని...గుర్తొచ్చినప్పుడల్లా మానసికంగా కృంగిపోతానని తెలిపింది. 'నాకు ఆ సంఘటన చాలా స్పష్టంగా



గుర్తుంది. బాంద్రాలో అప్పట్లో జాతరలు జరిగేవి. నేను యుక్త వయస్సులో ఉన్నాను. బహుశా అప్పుడు 14 సంవత్సరాలు వయసు అనుకుంటా. జాతర కోసం నా కుటుంబంతో కలిసి బయటకు వెళ్లాను. అంతా నడుచుకుంటూ వెళ్తోన్న సమయంలో నన్ను ఎవరో వెనకి నుంచి గిచ్చారు. నా ప్రయివేటు భాగాలు తాకే ప్రయత్నం చేసారు. వెనక్కు తిరిగి చూసినా రద్దీ ఎక్కువగా ఉండడంతో ఎవరు చేశారో? అర్ధం కాలేదు. ఎవరో నన్ను అనుచితంగా మళ్లీ మళ్లీ తాకడానికి ప్రయత్నించారని అర్థమైంది. దీంతో నేను మతి స్థిమితం కోల్పోయినట్లు అయింది. అప్పుడు నా వాళ్లు అంతా నా చుట్టూ ఉన్నా ఏం చెప్పలేకపోయాను' అని అంది. ఇంకా చిన్న వయసులో లైంగిక వేధింపులు ఎదుర్కున్న వారిలో నిత్యా మీనన్ కూడా ఉంది.

ఆమె పట్ల కూడా అనుచితంగా ప్రవర్తించినట్లు గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. ఇంకా పలువురు నటీమణులు బాల్యంలో తమకెదురైన చేదు అనుభవాల గురించి మీటూ ఉద్యమం సమయంలో తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే.

## చీరలో కూడా రష్మిక గ్లామర్ ఎటాక్

హీరోయిన్లు స్క్రీన్ పై ఎంత మోడ్రన్ డ్రెస్సుల్లో కనిపించినా.. చీర కట్టులో తళుక్కుమంటే ఆ కిక్కే వేరు. ఏదైనా వేడుకల్లో పది మందిలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలవాలన్నా కూడా మోడ్రన్ డ్రెస్సుల కంటే చీర కట్టుకు ఉండే క్రేజే వేరు. దీంతో బ్యూటీలు.. చీర కట్టుకుని ఫోటోలు పోస్ట్ చేస్తే చాలు.. నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తుంటారు. అయితే సౌత్ బ్యూటీ, స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నకు వరల్డ్ వైడ్‌గా ఫ్యాన్స్ ఉన్న విషయం తెలిసిందే. ఇండస్ట్రీలోకి ఆలస్యంగా వచ్చినప్పటికీ హిట్ సినిమాలు, పెద్ద హీరోలతో నటించి స్టార్ స్టేటస్ సొంతం చేసుకుంది ఈ బ్యూటీ. రీసెంట్ గా ఈ ముద్దుగుమ్మ.. యానిమల్ వంటి బ్లాక్ బస్టర్ హిట్ తో మరోసారి సౌత్, నార్త్ ఇండస్ట్రీలను కుదిపేసింది. తాజాగా లైట్ ఆరెంజ్ కలర్ చీరలో తన సోకులు చూపిస్తూ లేటెస్ట్ గా కొన్ని ఫోటోలను షేర్ చేసింది. చీర ఎప్పటికీ రాంగ్ సెలక్షన్ కాదంటూ క్యాప్షన్ ఇచ్చింది.



స్టన్నింగ్ చూపులతో కుర్రకారుకు గిలిగింతలు పెట్టేస్తోంది. ప్రస్తుతం చీర కట్టులో మాయ చేస్తున్న రష్మిక ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ పిక్స్ లో రష్మిక అందం దేంతో పోల్చిన తక్కువే అన్నట్లుగా ఉందని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. లవ్లీ, బ్యూటీఫుల్, మ్యాంగో బేబీ అంటూ కుర్రాళ్లు.. రష్మిక అందాన్ని తెగ పొగిడేస్తున్నారు. కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు.

సినిమాల్లో నటన, గ్లామర్ తో భారీగా అభిమానుల్ని సొంతం చేసుకున్న రష్మిక.. సోషల్ మీడియాలో కూడా తగ్గేదేలే అంటోంది. ఈ అమ్మడికి 41.5 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. రష్మిక మందన్న ప్రస్తుతం పుష్ప-2లో నటిస్తోంది. ఇందులో బన్నీకి జోడీగా పాపులర్ శ్రీవల్లి పాత్రలో యాక్ట్ చేస్తోంది. ఇప్పటికే ఈ పాత్ర దేశాలు దాటి పాపులర్ అయ్యింది. పుష్ప-1 పెద్ద హిట్ కావడంతో సీక్వెల్ పై భారీ అంచనాలున్నాయి. దీంతోపాటు రెయిన్ బో, ది గర్ల్ ఫ్రెండ్ చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోంది నేషనల్ క్రష్.




## గ్రూప్-1 పోస్టులు పెంపు.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరో 60 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. గతంలో 503 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. తాజాగా మరో 60 పోస్టులకు ఆమోదం తెలిపింది. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 563కి చేరింది. వీలైనంత త్వరగా ఈ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రూప్-1లో 19 విభాగాలకు చెందిన 503 పోస్టులను ఇంటర్వ్యూలు లేకుండానే భర్తీ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అందుకనుగుణంగా ప్రిలిమ్స్, మెయిన్స్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయాలని టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు చేసింది. గతేడాది జూన్ 11న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా.. దాదాపు 2.32లక్షల మంది హాజరయ్యారు. పేపర్ లీకేజీ, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రెండు సార్లు ఈ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే.




## కాంగ్రెస్‌లో చేరిన పెద్దపల్లి ఎంపీ

దిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు ముందు భారాసకు షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. దిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. సీఎంతో కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లిన వెంకటేశ్.. అక్కడ వివిధ అంశాలపై వారితో చర్చించారు. మరోవైపు ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన పలువురు భారాస నేతలు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

## ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్తే తీవ్ర నష్టం: కేసీఆర్



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ 3 నెలల విరామం అనంతరం పార్టీ కార్యాలయానికి వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి తెలంగాణ భవన్‌కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. జై తెలంగాణ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, నల్గొండ జిల్లాల ప్రజాప్రతినిధులతో మాట్లాడిన కేసీఆర్.. కృష్ణా జలాల పరిరక్షణ సభ ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ.. "రాష్ట్ర ప్రయోజనాలే భారాసకు ముఖ్యం. కృష్ణా బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి ప్రాజెక్టులు వెళ్తే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుంది. చివరకు డ్యామ్‌కు సున్నం వేయాలన్నా బోర్డు అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. భారాసకు పోరాటం చేయడం కొత్త కాదు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించ వద్దనే మా పోరాటం. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలివి లేదు. ఆ పార్టీ తీసుకున్న నిర్ణయం రైతుల సాగునీటి హక్కులకు గొడ్డలిపెట్టు లాంటిది. నల్గొండ జిల్లాలో ఈ నెల 13న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తాం.

రాష్ట్ర హక్కులు కాపాడేందుకు ఎంతకైనా పోరాడుతాం. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజా క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడతాం. మరో ప్రజా ఉద్యమంతో తెలంగాణ ప్రజల హక్కులు కాపాడుతాం" అని అన్నారు.

## తెలంగాణ ఈఏపీసెట్ షెడ్యూల్ విడుదల




హైదరాబాద్: తెలంగాణలో ఈఏపీసెట్ షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 21న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్ వెల్లడించారు. ఫిబ్రవరి 26 నుంచి ఏప్రిల్ 6 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మే 9 నుంచి 12 వరకు తెలంగాణ రాష్ట్ర ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలు జరుగుతాయని స్పష్టంచేశారు. మంగళవారం సెట్ కమిటీ సమావేశంలో ఈ షెడ్యూల్‌ను ఆమోదించినట్లు ఆయన వెల్లడించారు. గతంలో టీఎస్ ఎంసెట్‌గా పేర్కొనే ఈ పరీక్షకు టీఎస్ ఈఏపీసెట్‌గా ఇటీవలే మార్పు చేయగా.. జేఎన్‌టీయూ-హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరగనుంది.

## ఆ కుక్క బిస్కెట్లు నచ్చకే రాజీనామా చేశా: రాహుల్ గాంధీ వీడియోపై హిమంత

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరో వివాదంలో ఇరుక్కున్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఆయన ఓ కార్యకర్త చేతికి కుక్క తినే బిస్కెట్లు ఇచ్చినట్లు ఓ వీడియో వైరల్ అయ్యింది. దీన్ని భాజపా నేతలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ రాహుల్‌పై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఝార్ఖండ్‌లో జరిగిన యాత్ర సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ వీడియోను భాజపా నేత అమిత్ మాలవీయ షేర్ చేస్తూ.. "కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పార్టీ బూత్ ఏజెంట్లను కుక్కలతో పోల్చారు. ఇప్పుడేమో రాహుల్ కుక్క తినే బిస్కెట్లను కార్యకర్తలకు ఇస్తున్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు, యువరాజు కార్యకర్తలను కుక్కల్లా చూస్తారు కాబట్టి అలాంటి పార్టీ కనుమరుగవడం సహజమే" అంటూ దుయ్యబట్టారు. ఇది కాస్తా సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. దీన్ని కొందరు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మకు ట్యాగ్ చేశారు. ఆయన గతంలో రాహుల్ పెంపుడు శునకంపై కొన్ని వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పార్టీ మీటింగ్‌లకు రాహుల్ నివాసానికి వెళ్లేవాడినని, అప్పుడు ఆయన పెంపుడు కుక్క పిడి తినే ప్లేటులో నుంచే కాంగ్రెస్ నాయకులకు బిస్కెట్లు ఆఫర్ చేసేవారని హిమంత చాలా ఇంటర్వ్యూల్లో వెల్లడించారు. ఈ క్రమంలోనే నెటిజన్లు ఆయనకు ట్యాగ్ చేయగా.. తాజా వీడియోపై ఆయన స్పందించారు. "రాహుల్ గాంధీ మాత్రమే కాదు. ఆయన కుటుంబం మొత్తం కలిసినా నన్ను ఆ బిస్కెట్ తినేలా చేయలేకపోయారు. నేను ఆత్మాభిమానం ఉన్న అస్సామీని, భారతీయుడిని. అందుకే ఆ కుక్క బిస్కెట్లు నిరాకరించాను. కాంగ్రెస్‌కు రాజీనామా చేసాను" అని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. కాగా.. ఈ వివాదంపై రాహుల్‌గాంధీ స్పందించారు. వీడియోలో తాను మాట్లాడిన కార్యకర్తదే ఆ కుక్కపిల్ల అని వెల్లడించారు. "ఆ కుక్కపిల్లను చూడగానే ముచ్చటేసింది. దగ్గరకు తీసుకుని బిస్కెట్లు ఇచ్చేందుకు ప్రయత్నించా. కానీ అది భయపడిపోయింది. అందుకే దాని యజమానికి బిస్కెట్లు ఇచ్చి తినిపించమని చెప్పా. ఇందులో వివాదం చేయాల్సినంత ఏముంది?" అని భాజపా నేతలకు కౌంటర్ ఇచ్చారు.




## శివబాలకృష్ణ కేసులో వెలుగులోకి సంచలన విషయాలు

**ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన రెరా మాజీ కార్యదర్శి శివబాలకృష్ణ ఏసీబీ కస్టడీలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సోదరుడు నవీన్, మేనల్లుడు భరత్ పేరు మీద ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శివబాలకృష్ణ విచారణ రేపటితో ముగియనుండటంతో మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.**

## ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది



హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ, సబ్ ప్లాన్ వంటి అంశాలపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన వాదనలను సుప్రీంకోర్టులో ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం వింటోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వపక్షాన సీనియర్ న్యాయవాది వివేక్‌ను నియమించామని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. వివేక్ పాజిటివ్ వాదనలు వినిపిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రికి దళిత జాతి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత, ఆదివాసీలు అస్తిత్వం కోల్పోయేలా వ్యవహరించిందన్నారు. గద్దర్, అందెశ్రీ లాంటి గాయకులను బీఆర్ఎస్ విస్మరించినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సరైన గుర్తింపు ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టుపై సంపూర్ణమైన విశ్వసం ఉందన్నారు. ఎవరికి వ్యతిరేకంగా వర్గీకరణ చెయ్యాలని అడగడం లేదన్నారు. ఎవరి వాటా వారికి దక్కలనే దీని ఉద్దేశ్యమని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## ప్రజలు చిత్తుగా ఓడించినా బాల్క సుమన్‌కు బుద్ది రాలేదు: ఎమ్మెల్యే వివేక్



మంచిర్యాల: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు చిత్తుగా ఓడించినా సుమన్‌కు బుద్ధి లేదన్నారు.

ఈ సందర్భంగా మంగళవారం ఆయన మంచిర్యాలలో మీడియాతో మాట్లాడుతూ నోటి కొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాజకీయాల్లో ఈ తిట్లకు సృష్టి కర్త కేసీఆర్ అని, అధికారం తల కెక్కి అందర్నీ ఇష్టమొచ్చినట్టు కేసీఆర్ తిట్టారని, అధికారం కోల్పోయిన తర్వాత కూడా మార్పు రావడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదని, ఆ పార్టీ ఖాళీ అవుతుందని ఎమ్మెల్యే వివేక్ వ్యాఖ్యానించారు.

**బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు..** రండ పనులు చేసింది మీరు.. అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు ఘాటుగా స్పందించారు. రేవంత్‌ను ఉద్దేశించి ప్రచురించలేని భాషలో దుర్భాషలాడారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పరుష పదజాలంతో దూషించారు. చెత్త సీఎం రేవంత్‌ను చెప్పుతో కొడతానంటూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చెప్పు చూపిస్తూ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారు. మంచిర్యాల, పెద్దపల్లిలో ఆయన మాట్లాడారు. "కాలం కలిసొచ్చి అందలమెక్కావ్... నీ అదృష్టమో, తెలంగాణ ప్రజల దురదృష్టమో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నవ్. గతంలో చిల్లర మాటలు మాట్లాడిన నువ్వు.. ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయిలో పద్ధతిగా మాట్లాడాలె. పదేళ్ల పాటు తెలంగాణను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్‌ను తిడితే ఊరుకోం.. చెప్పుదీసి కొడుతా.. ఖబడ్దార్" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో పది మంది ముఖ్యమంత్రులు ఉన్నారని, ఎప్పుడు ఎవడు కుర్చీ లాగుతాడో, ఎవరు అంగీ లాగు లాగుతాడో తెలియని పరిస్థితి ఉందన్నారు. అదానీని రాహుల్ గాంధీ విమర్శిస్తే, రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లి రూ. 12 వేల కోట్ల పెట్టుబడులకు ఎలా అంగీకరించారని ప్రశ్నించారు. ఇప్పటిదాకా రైతు బంధు డబ్బులు వేయని ప్రభుత్వం.. కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం చెల్లించదచిందని మండిపడ్డారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సైతం పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించారన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత అగ్రహం




హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. 'ఎక్స్' వేదికగా సీఎం వైఖరిపై మండిపడ్డారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై అసభ్య పదజాలం ప్రయోగించిన సీఎం రేవంత్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే, దళిత బిడ్డ బాల్క సుమన్‌పై కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవలంబించిన విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తోందని విమర్శించారు. తెలంగాణలో ఢిల్లీ రిమోట్ కంట్రోల్ పాలన రాచరిక వ్యవస్థను తలపిస్తోందన్నారు. సూర్యునిపై ఉమ్మేస్తే అది తిరిగి మీ మీదే పడుతుందన్న విషయం రేవంత్ రెడ్డి మర్చిపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణను సాధించిన కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని కవిత వ్యాఖ్యానించారు.

## మరికొద్దిరోజుల్లో మేడారం మహా జాతర.. అంతలోనే మావోయిస్టులు ఏం చేశారో తెలుసా?

ములుగు : తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర మరికొద్దిరోజుల్లో ప్రారంభంకానుంది. ఈ క్రమంలో మేడారం జాతరపై మావోయిస్టుల లేఖ కలకలం రేపుతోంది. మేడారం జాతరకు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందంటూ మావోయిస్టు (జేఎమ్‌డబ్ల్యూపీ) కార్యదర్శి వెంకటేష్ పేరుతో లేఖ విడుదలైంది. మేడారం జాతరకు వచ్చిన ప్రజలకు సౌకర్యాలు లేవని.. మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను పూర్తిగా ఆదివాసి సంప్రదాయాలతోనే చేయాలని లేఖలో తెలిపారు. హిందూ సంప్రదాయాలైన లడ్డు, పులిహోర లాంటివి కాకుండా బెల్లం ప్రసాదంగా ఇవ్వాలన్నారు. జాతర అయిన వెంటనే ఆ ప్రాంతంలో ప్రభుత్వం బాధ్యత వహించి నిధులు కేటాయించి జబ్బులు రాకుండా శుభ్రం చేయాలన్నారు. జబ్బు పడిన వారికి తగిన చికిత్సను అందించాలని డిమాండ్ చేశారు. జాతర పనుల కోసం విడిచిపెట్టిన



పంట పొలాలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పంట పొలాల్లో బ్రాందీ సీసాలతో పాటు రకరకాల వ్యర్థ పదార్థాలు అన్నింటినీ తీసివేసే బాధ్యత ప్రభుత్వమే తీసుకుని చేయాలని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు.

## ఇద్దరు ఆడబిడ్డలు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం: ఎమ్మెల్సీ కవిత

యాదాద్రి: భువనగిరిలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని ఎమ్మెల్సీ కవిత పరిశీలించారు. పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఎస్సీ హాస్టల్లోని ఒకే గదిలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి బలవన్మరణానికి గల కారణాలపై ఎమ్మెల్సీ కవిత ఆరా తీశారు. అధికారులను అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ధైరంతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నప్పటికీ విద్యార్థినుల మృతికి గల కారణాలను పోలీసులు తెలుసుకోలేక పోవడం దారుణమన్నారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం హృదయవిధారకంగా ఉందని చెప్పారు. వారి సూసైడ్ లెటర్ పలు అనుమానాలకు తావిస్తున్నదని వెల్లడించారు. హాస్టల్ పరిసరాలు అనుమానాస్పదంగా ఉన్నాయని చెప్పారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించాలన్నారు. హాస్టల్‌కు తరచూ బయటి వ్యక్తులు వస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.

**హాస్టల్ సిబ్బందిపై అనుమానం** హాస్టల్ వార్డెన్ , వాచ్‌మాన్ ,ఆటో డ్రైవర్‌పై తమకు అనుమానాలు ఉన్నాయని భవ్య, వైష్ణవి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సూసైడ్ లెటర్ లో హ్యాండ్ రైటింగ్ తమ పిల్లలది కాదని స్పష్టం చేశారు. ఇటీవల ఆటో డ్రైవర్ విషయంలో చిన్న ఘటన జరగగా తమ దృష్టికి వచ్చిందని, ఇది పక్కా హత్యే అని వారు మండిపడ్డారు.

హాస్టల్‌లో ఇంతా జరగుతున్న వార్డెన్, యాజమాన్యం ఏం చేస్తున్నారని తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. వాచ్ మ్యాన్,ఆటో డ్రైవర్, వార్డెన్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com